ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya

# వార్త సంధ్య

తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 161 శనివారం 30 - 05 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 161 Saturday 30 - 05 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

# తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం

- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- వరి ధాన్యం కొనుగోళ్ల జాప్యంపై మంత్రి మీడియా సమావేశం
- ప్రతిపక్షాలు కావాలనే విమర్శలు చేస్తున్నాయని మండిపాటు
- 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- ఇప్పటికే 62 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించినట్లు వెల్లడి
- ఇప్పటికే రూ.13,050 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్న మంత్రి




**వార్త సంధ్య , హైదరాబాద్, మే 29 :**
ధాన్యం కొనుగోళ్ల అంశంపై ప్రతిపక్షాలు కావాలనే రాజకీయ విమర్శలు చేస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం వరి కొనుగోలు కోసం చేస్తున్నంత ఖర్చు భారతదేశ చరిత్రలో ఏనాడూ ఏ ప్రభుత్వమూ చేయలేదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర ప్రభుత్వమే అంగీకరించిందని గుర్తు చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను దేశవ్యాప్తంగా వరి కొనుగోళ్లు జరపడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని మంత్రి వెల్లడించారు.రైతులను ఆదుకుంటామంటూ బీజేపీ నాయకులు క్షేత్రస్థాయిలో నాటకీయ నిరసనలు చేస్తున్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరల విధానం ప్రకారమే తాము ధాన్యాన్ని సేకరిస్తున్నామని, రైతులు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ యాసంగి సీజన్ పంటలో రాష్ట్రవ్యాప్తంగా - మిగతా 2 లో



## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు

- 'ఈగిల్ టీమ్' పేరిట విధులు
- తెలంగాణలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ ఉద్యోగాలు
- హైడ్రా సంస్థలో... కబ్జాల తొలగింపు విధుల్లో నియామకం
- ఈ ఉద్యోగం తమకు గౌరవం, ఆత్మవిశ్వాసం ఇచ్చిందని వెల్లడి
- వారి పనితీరుపై అధికారుల ప్రశంసలు

**వార్త సంధ్య , హైదరాబాద్, మే 29 :**
తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన - మిగతా 2 లో

ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న

## రేవంత్ రెడ్డి ప్రభుత్వం

- ఉద్యోగుల బకాయిలను 100 రోజుల్లో విడుదల చేస్తామని హామీ
- ఈ క్రమంలో తొలి విడతగా రూ.2 వేల కోట్ల బకాయిల విడుదల
- ఉద్యోగ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం

**వార్త సంధ్య , హైదరాబాద్, మే 29 :**
తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కాంగ్రెస్ సర్కారు శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిల తొలి విడత మొత్తాన్ని ఇవాళ విడుదల చేశారు. ఉద్యోగుల సుదీర్ఘకాల బకాయిలను కేవలం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ఉద్యోగ జేఏసీ నాయకులకు స్పష్టమైన - మిగతా 2 లో

## దేశానికి రుతుపవనాల షాక్



- ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం!
- 2026 నైరుతి రుతుపవనాలపై ఐఎండీ కీలక అంచనా
- దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదుకు అవకాశం
- ఎల్ నినో ప్రభావమే బలహీన రుతుపవనాలకు కారణమని వెల్లడి
- జూన్‌లో ఏపీ సహా పలు రాష్ట్రాల్లో పెరగనున్న వడగాడ్పుల తీవ్రత
- దీర్ఘకాల సగటులో 90 శాతం వర్షపాతమే నమోదయ్యే సూచనలు

**వార్త సంధ్య , ఢిల్లీ, మే 29 :**
ఈ ఏడాది దేశవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు బలహీనంగా ఉండే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తన తాజా నివేదికలో వెల్లడించింది. 2026 - మిగతా 2 లో



## మే 31న ఆకాశంలో అరుదైన దృశ్యం హైదరాబాద్‌లోనూ చూడొచ్చు!

- కనువిందు చేయనున్న బ్లూ మైక్రోమూన్
- ఒకే నెలలో రెండో పౌర్ణమిగా రాక
- హైదరాబాద్‌లో సాయంత్రం వీక్షించేందుకు ఉత్తమ సమయం
- సాధారణ పౌర్ణమి కంటే కాస్త చిన్నగా కనిపించనున్న చంద్రుడు

**వార్త సంధ్య , హైదరాబాద్, మే 29 :**
హైదరాబాద్ నగరవాసులతో పాటు దేశవ్యాప్తంగా ఖగోళ ప్రియులు మే 31న ఒక అరుదైన దృశ్యాన్ని వీక్షించబోతున్నారు. ఆ రోజు ఆకాశంలో 'బ్లూ మైక్రోమూన్' - మిగతా 2 లో

## త్వరలో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు?

- ఆర్‌బీఐ చర్చలు..!
- భారీగా పెరిగిన పేపర్ కరెన్సీ ముద్రణ ఖర్చు
- సవాల్‌గా మారిన చిరిగిన నోట్ల నిర్మూలన
- పరిష్కారంగా ప్లాస్టిక్ నోట్లపై ఆర్బీఐ చర్చలు
- తక్కువ ఖర్చు, ఎక్కువ మన్నిక
- త్వరలోనే పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభానికి యోచన



**వార్త సంధ్య , ఢిల్లీ, మే 29 :**
దేశంలో త్వరలోనే ప్లాస్టిక్ (పాలిమర్) కరెన్సీ నోట్లు చలామణిలోకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నగదుకు డిమాండ్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో 'రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' (ఆర్‌బీఐ) ఈ - మిగతా 2 లో

## కాక్రోచ్ జనతా పార్టీ ఖాతా నిలిపివేత

- కేంద్రానికి, ఎక్స్ సంస్థకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు
- కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతా నిలిపివేత
- ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే
- తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించిన హైకోర్టు







రాహుల్ గాంధీతో

## షర్మిల భేటీ

- కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు
- భేటీలో షర్మిల భర్త అనిల్ కుమార్, కేసీ వేణుగోపాల్
- కర్ణాటక నుంచి రాజ్యసభ సీటు కోరుతున్నట్లు కథనాలు
- వైఎస్‌ఆర్టీపీని విలీనం చేసిన సమయంలో రాజ్యసభ హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్ఠానం



## మహానాడు విజయాన్ని అందరికీ అంకితం చేస్తున్నా

- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్
- విజయవంతంగా ముగిసిన టీడీపీ మహానాడు
- తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయిన తర్వాత జరిగిన తొలి మహానాడు అన్న లోకేశ్
- టీడీపీ టీమ్ కృషి వల్ల మహానాడు విజయవంతం అయిందన్న లోకేశ్

**వార్త సంధ్య , అమరావతి, మే 29 :**
తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మహానాడు నిన్న విజయవంతంగా ముగిసింది. ఈ నేపథ్యంలో టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ స్పందిస్తూ... మహానాడు విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి - మిగతా 2 లో

# ఏపీలో రూ.22 వేల కోట్లతో భారీ విద్యుత్ కారిడార్

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు ప్రతిపాదనలు
- 18 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేలా ప్రణాళిక
- ప్రభుత్వ భవనాలు, పాఠశాలల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు వేగవంతం చేయాలని ఆదేశం
- పీఎం సూర్యఘర్ పథకంలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని సీఎం సూచన
- రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు వరల్డ్ ఎకనమిక్ ఫోరంతో కలిసి పనిచేయాలని నిర్ణయం



**వార్త సంధ్య , అమరావతి, మే 29 :**
ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని ప్రోత్సహించడంతో పాటు, దానిని సమర్థంగా గ్రిడ్‌కు అనుసంధానించేందుకు భారీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా, సుమారు రూ.22 వేల కోట్ల వ్యయంతో 'గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3' నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 18 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించాలని లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ శాఖ పనితీరుపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రీన్ ఎనర్జీ కారిడార్, విద్యుత్ సరఫరా, పీఎం సూర్యఘర్, పీఎం కుసుమ్ వంటి పథకాల అమలు పురోగతిపై విస్తృతంగా చర్చించారు.గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఫేజ్-3 కింద చేపట్టనున్న చర్యలపై సీఎం ఆరా తీయగా, అధికారులు పూర్తి వివరాలు అందించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే 18 గిగావాట్ల హరిత విద్యుత్‌ను ప్రధాన గ్రిడ్‌కు అనుసంధానించేందుకు - మిగతా 2 లో




విశాఖ కేంద్రంగా

## కొత్త రైల్వే జోన్

- జూన్ 1 నుంచి కార్యకలాపాలు
- కొత్త జోన్ పరిధిలోకి విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు
- నెరవేరిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని హామీ
- మూడు డివిజన్లకు పరిమితం కానున్న దక్షిణ మధ్య రైల్వే

# సంపాదకీయం

## ‘గిగ్’ కార్మికుల రక్షణే నేటి సామాజిక న్యాయం

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ఆమోదించిన గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్ల (రిజిస్ట్రేషన్, సామాజిక భద్రత, సంక్షేమం) చట్టం కొన్ని కీలక సంస్కరణలకు నాంది పలికింది. ఈ చట్టంలోని సెక్షన్ 8 ప్రకారం కార్మికులు విధి నిర్వహణలో మరణిస్తే ఎటువంటి షరతులు లేకుండా తక్షణమే ప్రమాద బీమా అందుతుంది. సెక్షన్ 12 ప్రకారం ‘ఆటోమేటెడ్ మానిటరింగ్’ అల్గారిథమ్‌లు ఎలా పనిచేస్తాయో తెలుసుకునే హక్కు కార్మికులకు లభిస్తుంది. అలాగే యాజమాన్యాలు ఏకపక్షంగా కార్మికులను తొలగించకుండా కనీసం ఏడు రోజుల ముందు రాతపూర్వక నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.భారత గిగ్ ఎకానమీ వేగంగా వృద్ధి చెందుతోంది. ఎకనామిక్ సర్వే 2025--26 ప్రకారం, గిగ్ కార్మికుల సంఖ్య 2024--25 నాటికి సుమారు 12 మిలియన్లకు పెరిగింది. ఈ సంఖ్య 2029--30 నాటికి 23.5 మిలియన్లకు, 2047 నాటికి 62 మిలియన్లకు చేరుకోవచ్చు. ఈ శ్రామికశక్తిలో మహిళలు సుమారు 28శాతం మంది ఉండగా, దాదాపు 40శాతం మంది నెలకు రూ.15వేల కంటే తక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. 2029--30 నాటికి ఈ రంగం సేవల విలువ రూ.2.35 లక్షల కోట్లకు చేరవచ్చని అంచనా.కానీ ఈ అంకెల వెనుక, తగిన భద్రతా చర్యలు, సమగ్ర బీమా లేకుండా ప్రమాదకర పరిస్థితులలో పనిచేస్తున్న కార్మికవర్గం ఉంది. ఏప్రిల్ 7 అర్ధరాత్రి హైదరాబాద్‌లో శివ, సందీప్ అనే ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు డెలివరీ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్నారు. కుటుంబాలపై ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో వారు రాత్రి షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. ఒక కారు డ్రైవర్ వారి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టగా ఆ ఇద్దరూ ప్రాణాలు కోల్పోయారు. ఫిబ్రవరిలో, ఢిల్లీలో వేకువజామున 3:30 గంటలకు 25 ఏళ్ల హేమ్ శంకర్ ఈ--స్కూటర్‌ను కారు వెనుక నుంచి ఢీకొట్టడంతో మరణించాడు. ఆ ఆర్డర్లు ఇచ్చిన వినియోగదారులకు ‘ఆర్డర్ క్యాన్సిల్ అయింది’ అని ఒక మెసేజ్ మాత్రమే వచ్చి ఉంటుంది. తమ ఇంటికి కొన్ని మీటర్ల దూరంలోనే డెలివరీ బాయ్ ప్రాణాలు కోల్పోయాడన్న చేదు నిజం వారికి తెలియకపోవచ్చు.2025 నవంబర్‌లో అమల్లోకి వచ్చిన ‘సోషల్ సెక్యూరిటీ కోడ్--2020’ గిగ్ కార్మికులను ఒక ప్రత్యేక తరగతిగా గుర్తించింది. దీని ప్రకారం సంస్థలు తమ వార్షిక టర్నోవర్‌లో 1--2 శాతం సామాజిక భద్రతా నిధికి జమ చేయాలి. అయితే, ముసాయిదా సోషల్ సెక్యూరిటీ కోడ్ నిబంధనల ప్రకారం ఈ ప్రయోజనాలు పొందాలంటే కనీసం 90 రోజులు పనిచేయాలన్న నిబంధన ఉంది. జనవరిలో నోయిడాలో 18 ఏళ్ల డెలివరీ బాయ్ అంకుష్ విధుల్లో చేరిన తొలిరోజే రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. డెలివరీ ఏజెంట్‌గా చేరిన మొదటి రోజు నుంచే ఎలాంటి షరతులు లేకుండా నగదు రహిత అత్యవసర వైద్యం అందించేలా నిబంధనలు తక్షణమే మార్చాలి. ముఖ్యంగా, తెలంగాణ చట్టం సెక్షన్ 8(బి) ప్రకారం ‘సంక్షేమ బోర్డు’కు ఈ నిబంధనలు నోటిఫై చేసే అధికారం ఉంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న సమయంలోనూ గిగ్ కార్మికులు గంటలపాటు రోడ్లపైనే గడుపుతున్నారు. తమిళనాడు ప్రభుత్వం చెన్నై నగరంలో గిగ్ కార్మికుల కోసం ఉచితంగా ఏర్పాటు చేసిన ఏసీ లాంజ్‌ల తరహాలో దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో నీడ, తాగునీరు, ఛార్జింగ్, మరుగుదొడ్ల సదుపాయాలతో కూడిన విశ్రాంతి కేంద్రాలను నిర్మించడం యాజమాన్యాలు, ప్రభుత్వాల తక్షణ కర్తవ్యం. వీధి కుక్కలు, సరైన వెలుతురు లేని భవనాలు లాంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పుడు కస్టమర్లు ముందుగానే యాప్ ద్వారా సమాచారం ఇచ్చే అవకాశం ఉండాలి. అలాగే కార్మికులకు ఆర్డర్‌ను తిరస్కరించే హక్కు ఉండాలి. ఈ సమస్యల పరిష్కారానికి యాప్‌లలో తక్షణమే కొన్ని మార్పులు తీసుకురావాలి.ముఖ్యంగా రాత్రి 10 నుంచి ఉదయం 5 గంటల మధ్య ఆర్డర్ చేసేటప్పుడు రాత్రి పూట అత్యవసర సమ్మతిని తప్పనిసరి చేయాలి. ‘ఈ డెలివరీ కోసం ఒక వ్యక్తి రాత్రి పూట రోడ్డుపై ప్రయాణించాలి, ఇది రేపు ఉదయం డెలివరీ చేయవచ్చా’ అనే ఆప్షన్ వినియోగదారులకు స్పష్టంగా కనిపించాలి. అలాగే ఉదయానికి ఆర్డర్ షెడ్యూల్ చేసుకునే వినియోగదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలు ఇవ్వాలి. రాత్రి పూట చేసే ఆర్డర్లకు ప్రత్యేక సర్‌ఛార్జ్ వసూలు చేసి, ఆ నిధిని కార్మికుల బీమాకు, రిఫ్లెక్టివ్ సేఫ్టీ జాకెట్లు అందించేందుకు వాడాలి.మన గుమ్మం వద్దకు డెలివరీ బ్యాగ్ వేసుకుని వచ్చేది ఎవరో కాదు, నిరుద్యోగం వల్ల కుటుంబ భారాన్ని మోస్తూ ఆత్మగౌరవంతో సొంత కాళ్లపై నిలబడాలని తపించే మన విద్యావంతులైన యువతే అనే దృక్పథం సమాజంలో రావాలి. మనమే నాలుగు అడుగులు ముందుకేసి డెలివరీని స్వీకరించడం, డెలివరీ చేతికి అందగానే చిరునవ్వుతో ‘థాంక్స్’ చెప్పడం, ఒక గ్లాసు చల్లటి నీళ్లు అందించడం... వారి అలసటను దూరం చేస్తాయి. శివ, సందీప్, హేమ్ శంకర్ కేవలం గణాంకాలు కారు. మెరుగైన భవిష్యత్తు కోసం కలలు కన్న యువకులు. వారిని విస్మరించడం ఏ మాత్రం తగదు. ఎందుకంటే మరో ఆర్డర్ మన ఇంటికి వస్తూనే ఉంటుంది, మనం మేల్కోకపోతే మరో విషాదం కూడా అలాగే పునరావృతమవుతుంది.

## మహానాడు విజయాన్ని అందరికీ అంకితం చేస్తున్నా

**మొదటిపేజీ తరువాయి -** ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని చెప్పారు. కోట్లాది మంది టీడీపీ కుటుంబ సభ్యుల ఆశీస్సులతో తాను పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యానని... తాను ఈ పదవిని చేపట్టిన తర్వాత జరిగిన తొలి మహానాడు ఇదని అన్నారు. టీడీపీ టీమ్ కృషి వల్ల మహానాడు విజయవంతం అయిందని చెప్పారు.మహానాడు 2026 విజయాన్ని పార్టీ నేతలు, కార్యకర్తలు, మహానాడు కమిటీలు, పార్టీ కార్యాలయ యంత్రాంగం, బ్యాక్ ఆఫీస్, సాంకేతిక సిబ్బంది,అనుబంధ సంఘాలు, మీడియా మిత్రులు, సోషల్ మీడియా అభిమానులు, ఎన్ఆర్ఐలు, మిత్రపక్షాలు, ప్రజలు, భద్రతా సిబ్బంది అందరికీ అంకితం చేస్తున్నానని తెలిపారు. మీ కృషికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని చెప్పారు. నెల్లూరులో జరగాల్సిన మహానాడును ప్రధాని మోదీ పిలుపుతో, అందరి ఆమోదంతో హైబ్రిడ్ విధానంలోకి మార్చామని లోకేశ్ తెలిపారు. సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకోవడాన్ని చంద్రబాబు మనకు నేర్పారని... ఆ నేర్పును హైబ్రిడ్ మహానాడుకు ఉపయోగించి విజయవంతం చేశామని చెప్పారు. ఇప్పుడు ప్రతి ఇల్లు, ప్రతి పల్లె మహానాడుకు వేదిక అయిందని అన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేయడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిందని... ఇది మహానాడు సాధించిన మరో ఘన విజయమని

## త్వరలో భారత్‌లో ప్లాస్టిక్ కరెన్సీ నోట్లు?

**మొదటిపేజీ తరువాయి -** దిశగా అడుగులు వేస్తోంది. ఇటీవల పట్నా, ముంబై నగరాల్లో జరిగిన బోర్డు సమావేశాల్లో ప్లాస్టిక్ నోట్లపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. ప్రస్తుతం వాడుతున్న కాగితపు నోట్లతో పోలిస్తే వాటి ముద్రణ ఖర్చు తక్కువగా ఉండటం, ఎక్కువ కాలం మన్నడమే ఇందుకు కారణం.గత ఆర్థిక సంవత్సరంలో కరెన్సీ నోట్ల ముద్రణ కోసం ఆర్‌బీఐ ఏకంగా రూ.6,372.8 కోట్లు ఖర్చు చేసింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది చాలా పెరిగింది. కొత్తగా తీసుకురాబోయే ప్లాస్టిక్ నోట్లను సులభంగా విత్‌డ్రా చేసుకునేలా ఏటీఎం యంత్రాల్లోనూ అవసరమైన సాంకేతిక మార్పులు చేయనున్నారు. ఇందుకోసం త్వరలోనే దేశంలోని కొన్ని ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా ప్లాస్టిక్ నోట్లను విడుదల చేసేందుకు ఆర్‌బీఐ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. డిజిటల్ చెల్లింపులు పెరుగుతున్నా మార్కెట్లో నగదు చలామణి రికార్డు స్థాయిలో రూ.42.86 లక్షల కోట్లకు చేరింది.మార్కెట్లో పాడైపోయిన, చిరిగిపోయిన నోట్లను సేకరించి వాటిని నిర్మూలించడం ఆర్‌బీఐకి సవాలుగా మారింది. గత ఏడాదిలోనే సుమారు 23.8 బిలియన్ల పాత నోట్లను వెనక్కి తీసుకుంది. ఇందులో ఎక్కువగా రూ.500, రూ.100 నోట్లే ఉన్నాయి. ప్లాస్టిక్ నోట్లు వస్తే ఈ సమస్య చాలా వరకు తగ్గుతుంది. గతంలో 2012లో యూపీఏ ప్రభుత్వం ఐదు నగరాల్లో రూ.10 ప్లాస్టిక్ నోట్లను ప్రయోగాత్మకంగా తీసుకురావాలని చూసినప్పటికీ సాంకేతిక కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ అప్పట్లో ఆగిపోయింది. కానీ ఇప్పుడు పూర్తి స్థాయి సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఆర్‌బీఐ ఈ నిర్ణయాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది.

## మే 31న ఆకాశంలో అరుదైన దృశ్యం



**మొదటిపేజీ తరువాయి -** కనువిందు చేయనుంది. ఒకే నెలలో రెండోసారి పౌర్ణమి రావడం, అదే సమయంలో ఈ ఏడాదిలోనే చంద్రుడు అత్యంత చిన్నగా కనిపించనుండటం దీని ప్రత్యేకత.2026 మే నెలలో రెండు పౌర్ణములు సంభవిస్తున్నాయి. మొదటి పౌర్ణమి మే 1న రాగా, రెండోది మే 31న రానుంది. సాధారణంగా ఒకే క్యాలెండర్ నెలలో రెండోసారి వచ్చే పౌర్ణమిని ‘బ్లూ మూన్’ అని పిలుస్తారు. అలాగే, మే 31న చంద్రుడు భూమికి అత్యంత దూరంలో (అపోజీ) ఉండనున్నందున దీనిని ‘మైక్రోమూన్’ అని కూడా అంటున్నారు. ఇలా బ్లూ మూన్, మైక్రోమూన్ రెండూ ఒకేసారి రావడం చాలా అరుదు.ఈ బ్లూ మైక్రోమూన్ సాధారణ పౌర్ణమి చంద్రుడి కంటే 6-7 శాతం చిన్నగా, కొంచెం తక్కువ ప్రకాశవంతంగా కనిపిస్తుంది. అయితే, పేరులో ‘బ్లూ’ ఉన్నప్పటికీ చంద్రుడు నీలం రంగులో కనిపించడు. ఇది కేవలం ఒక ఖగోళ నామకరణం మాత్రమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.హైదరాబాద్‌లో మే 31న సాయంత్రం 6:30 నుంచి 7:30 గంటల మధ్య తూర్పు వైపు ఆకాశంలో దీన్ని స్పష్టంగా చూడవచ్చు. వాతావరణం అనుకూలిస్తే ఎలాంటి ప్రత్యేక పరికరాలు లేకుండానే కళ్లతో ఈ అద్భుతాన్ని వీక్షించవచ్చు. ఈ సమయంలో చంద్రుడు స్కార్పియస్ రాశిలోని ప్రకాశవంతమైన అంటారిస్ నక్షత్రానికి సమీపంలో కనిపిస్తాడు.

# ఏపీలో రూ.22 వేల కోట్లతో భారీ విద్యుత్ కారిడార్




**మొదటిపేజీ తరువాయి -** చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో 11 గిగావాట్ల సౌర విద్యుత్, 7 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఉంటుందని వివరించారు.ఈ కారిడార్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,261 కిలోమీటర్ల మేర కొత్త ట్రాన్స్‌మిషన్ లైన్లు వేయనున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు, 9,500 మెగావాట్ల సామర్థ్యంతో ముదిగుబ్బ, తలుపుల, రామాయపట్నం, పోరుమామిళ్ల, కొప్పాక ప్రాంతాల్లో ఐదు భారీ పూలింగ్ స్టేషన్లను నిర్మించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తిని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, దానికి అనుగుణంగా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కారిడార్ పూర్తయితే రాష్ట్రంలో ఏర్పాటయ్యే డేటా సెంటర్లకు నిరంతరాయ విద్యుత్ సరఫరా సాధ్యమవుతుందని, తద్వారా భారీ పెట్టుబడులు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టును కాలపరిమితితో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలులో ఏపీ ప్రస్తుతం దేశంలో నాలుగో స్థానంలో ఉందని, అగ్రస్థానానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన 1,35,821 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు అమర్చామని, మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బీసీ వర్గాలకు రూ.20 వేల సబ్సిడీతో 10 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెళ్లు బిగించే లక్ష్యాన్ని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భవనాలపై 200 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే పనులు వేగవంతం చేయాలన్నారు. రెస్కో మోడల్‌లో, నెట్ మీటరింగ్ విధానంలో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరు జిల్లాలోని 78 గురుకుల పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. అలాగే, 2,898 హాస్టళ్లు, స్కూళ్లలో ‘నెట్ జీరో’ విధానంలో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.దేశంలోనే తొలిసారిగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీకి చెందిన ‘ప్రవాహ్’ సంస్థ సహకారంతో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్ ద్వారా ‘డిజిటల్ ట్విన్ గ్రిడ్’ రూపొందిస్తున్నామని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీఈపీడీసీఎల్ పరిధిలో విద్యుత్ సాంకేతిక నష్టాలను తగ్గించేందుకు ఇది ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. మరోవైపు, రాష్ట్రంలో 131 ప్రాంతాల్లో 577 ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటు ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు. వచ్చే ఆరు నెలల్లో రాష్ట్రంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 12,226 మెగావాట్లకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. ఈ ఏడాది మే 21న రాష్ట్రంలో అత్యధికంగా 15,016 మెగావాట్ల గరిష్ట డిమాండ్ నమోదైందని గుర్తుచేశారు.సమీక్ష అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబుతో వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) ప్రతినిధుల బృందం భేటీ అయింది. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి థీమాటిక్ ‘సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రెవల్యూషన్’ కార్యాచరణపై చర్చించారు. గ్రీన్ ఎనర్జీ, ఎనర్జీ ట్రాన్సిషన్, సైబర్ రెసిలియెన్స్ వంటి అంశాలపై ఈ కేంద్రం అధ్యయనం చేయనుంది.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ రంగాల్లో ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. విశాఖ డేటా సెంటర్ కారిడార్, గ్రీన్ హైడ్రోజన్ పెట్టుబడులను కార్యాచరణతో అనుసంధానం చేయాలని, ఫలితాలు సాధించేలా పనిచేయాలని ఆదేశించారు. వచ్చే దావోస్ సదస్సు నాటికి ఏపీ సాధించిన పురోగతిని ప్రపంచానికి చాటిచెప్పే స్థాయికి ఎదగాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశాల్లో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్, విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీతో షర్మిల భేటీ



**మొదటిపేజీ తరువాయి -** కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీతో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కర్ణాటకలో త్వరలో రాజ్యసభ ఎన్నికలు ఉన్నాయి. ఇలాంటి సమయంలో ఆమె పార్టీ అగ్రనాయకుడితో భేటీ కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఢిల్లీలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉన్నారు. కర్ణాటక నుంచి రాజ్యసభ సీటును షర్మిల కోరుతున్నట్లు మీడియాలో ప్రచారం సాగుతోంది.వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేసిన సమయంలో షర్మిలకు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం రాజ్యసభ సీటును హామీ ఇచ్చిందని తెలుస్తోంది. ఇప్పుడు కర్ణాటకలో రాజ్యసభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో, ఏపీలో పార్టీని బలోపేతం చేయడానికి, రాజ్యసభలో కాంగ్రెస్ తరఫున ఏపీ గొంతును వినిపించడానికి తనకు రాజ్యసభ సీటును ఇవ్వాలని ఆమె కోరుతున్నారని తెలుస్తోంది.రాహుల్ గాంధీతో భేటీ అనంతరం షర్మిల కారులో వెళుతుండగా మీడియా పలకరించింది. ఈ సమావేశంలో ఎప్పటిలా సాధారణ సమీక్ష జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఏపీ తాజా రాజకీయ పరిణామాలపై చర్చించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీతో భేటీలో షర్మిలతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## విశాఖ కేంద్రంగా కొత్త రైల్వే జోన్




**మొదటిపేజీ తరువాయి -** ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల నెరవేరనుంది. విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న దేశంలోని 18వ రైల్వే జోన్ ‘దక్షిణ కోస్తా రైల్వే’ జూన్ 1 నుంచి అధికారికంగా కార్య కలాపాలు ప్రారంభించనుంది. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లతో పాటు, తూర్పు కోస్తా రైల్వేలోని వాల్తేరు డివిజన్‌ను పునర్వ్యవస్థీకరించి ‘విశాఖపట్నం డివిజన్’గా మార్చి కొత్త జోన్‌లో విలీనం చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం-2014లోని హామీ మేరకు ఈ ప్రాంతంలో రైల్వే పాలనను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. 2019 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఈ జోన్ ఏర్పాటు ప్రక్రియ ఇప్పుడు కార్యరూపం దాల్చింది.ఈ పునర్వ్యవస్థీకరణతో సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వే పరిధి గణనీయంగా తగ్గనుంది. ప్రస్తుతం ఆరు డివిజన్లు ఉండగా, ఇకపై హైదరాబాద్, నాందేడ్, పునర్వ్యవస్థీకరించిన సికింద్రాబాద్ డివిజన్లతో మాత్రమే కొనసాగుతుంది. కార్యకలాపాల సౌలభ్యం కోసం పలాస-ఇచ్ఛాపురం, రాయచూరు-వాడి వంటి కొన్ని సెక్షన్లను కూడా సర్దుబాటు చేశారు.కొత్త జోన్ ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు వేగవంతం కావడంతో పాటు, పాలనా సామర్థ్యం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జూన్ 1న కార్యకలాపాలు ప్రారంభించేందుకు రైల్వే ఉన్నతాధికారులు ఏర్పాట్లను సమీక్షించారు. విశాఖలో తాత్కాలిక భవనంలో జోన్ కార్యకలాపాలు ప్రారంభం కానుండగా, శాశ్వత భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

# దేశానికి రుతుపవనాల షాక్



**మొదటిపేజీ తరువాయి -** రుతుపవనాలకు సంబంధించి విడుదల చేసిన దీర్ఘకాలిక అంచనాల ప్రకారం, జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో వర్షపాతం దీర్ఘకాల సగటు (ఎల్‌పీఏ)లో కేవలం 90 శాతానికి పరిమితం కావొచ్చని తెలిపింది. ఈ అంచనాల్లో 4 శాతం అటూఇటూగా మార్పులు ఉండొచ్చని పేర్కొంది. దీంతో ఈసారి వర్షపాతం ‘సాధారణం కంటే తక్కువ’ కేటగిరీలోకి వస్తుందని, ఇది వ్యవసాయ రంగం, జలవనరులు, దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం అవుతోంది.ఈ అంచనాలకు ప్రధాన కారణంగా పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న ఎల్ నినో పరిస్థితులను ఐఎండీ పేర్కొంది. ఎల్ నినో సాధారణంగా రుతుపవన వ్యవస్థను బలహీనపరుస్తుంది. మరోవైపు, రుతుపవనాలకు మేలు చేసే ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) ప్రస్తుతం తటస్థంగా ఉందని, రుతుపవన కాలంలో కూడా అలాగే కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో, ఈ సీజన్‌లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదయ్యేందుకు 84 శాతం అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. ఇటీవలి సంవత్సరాలలో ఇది అత్యంత బలహీనమైన రుతుపవన సీజన్లలో ఒకటిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది.ప్రాంతాల వారీగా చూస్తే.. దేశంలోని అధిక వర్షాధార వ్యవసాయ ప్రాంతాలు ఉండే ‘మాన్‌సూన్ కోర్ జోన్’లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉంటుందని అంచనా వేశారు. ఈశాన్య భారతంలో సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండగా, వాయువ్య, మధ్య, దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలో లోటు వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ తెలిపింది. అయితే, వాయువ్య, ఈశాన్య, తూర్పు భారతంలోని కొన్ని ప్రాంతాలతో పాటు దక్షిణ ద్వీపకల్పంలోని తూర్పు భాగాలలో అక్కడక్కడా సాధారణం నుంచి అధిక వర్షపాతం కురవవచ్చని పేర్కొంది.ఇక, జూన్ నెలకు సంబంధించి దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కన్నా తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ హెచ్చరించింది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్, బీహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, గుజరాత్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ వడగాడ్పులు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నీటి యాజమాన్య పద్ధతులు, కరవును తట్టుకునే విత్తనాల ఎంపిక వంటి ప్రత్యామ్నాయ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని సలహా ఇచ్చింది. జులై నెలకు సంబంధించిన పూర్తిస్థాయి అంచనాలను జూన్ చివరి వారంలో విడుదల చేయనున్నట్లు ఐఎండీ వెల్లడించింది.మన దేశంలో కాక్రోచ్ జనతా పార్టీ తాజా సంచలనాలకు కేంద్ర బిందువుగా మారిన సంగతి తెలిసిందే. పెద్ద సంఖ్యలో యువత, సెలబ్రిటీలు ఈ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారు. మరోవైపు, ఈ పార్టీ ఎక్స్ ఖాతాను ఇండియాలో నిలిపి వేసిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో ఎక్స్ ఖాతాను నిలిపివేయడంపై కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఎలాంటి కారణం లేకుండానే తమ పార్టీ ఖాతాను ఎక్స్ నిలిపి వేసిందంటూ ఆయన పిటిషన్ వేశారు.ఈ పిటిషన్ పై నేడు హైకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ పురుషైంద్ర కుమార్ కౌరవ్ ధర్మాసనం పిటిషన్ ను విచారించింది. ఈ సందర్భంగా అభిజిత్ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... ఎక్స్ ఖాతా నిలిపివేయడం ద్వారా పార్టీ కార్యకలాపాలు, ప్రజలతో సంబంధాలు దెబ్బతింటున్నాయని కోర్టుకు తెలిపారు. వెంటనే పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని కోరారు.ఈ వాదనలపై కోర్టు స్పందిస్తూ... తక్షణమే ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలన్న విన్నపాన్ని తిరస్కరించింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి, ఎక్స్ సంస్థకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జులై 7వ తేదీకి వాయిదా వేసింది. తదుపరి విచారణలోగా కేంద్ర ప్రభుత్వం, ఎక్స్ సంస్థ తమ సమాధానాలను సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు సూచించింది.

# తడిసిన ధాన్యం సహా ప్రతి గింజనూ కొంటాం




**మొదటిపేజీ తరువాయి -** 141 లక్షల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండిందని, అందులో 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేశామన్నారు. అయితే, కేంద్ర ప్రభుత్వం ఇందులో కేవలం 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ముందే చెప్పిందని వెల్లడించారు. మిగిలిన అదనపు ధాన్యాన్ని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వమే అప్పు చేసి మరి కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని స్పష్టం చేశారు.ఈ యాసంగి పంటలో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు మంత్రి తెలిపారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, అక్కడ రైతులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించామని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి ఇప్పటికే రూ.13,050 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.ధాన్యం రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇసుక లారీలను, అలాగే ఇతర ఫ్యాక్టరీల్లో నడిచే భారీ వాహనాలను కూడా ధాన్యం సేకరణకు ఉపయోగించాలని భావిస్తున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం వాహనాలను కేటాయించాలని ఆయా యాజమాన్యాలను కోరినట్లు తెలిపారు. అయితే, ప్రస్తుతం హమాలీల కొరత కొంత వేధిస్తోందని, బీహార్, బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులపైనే ఇందుకు ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోందని మంత్రి వివరించారు. ఈ ఇబ్బందులను కూడా అధిగమించి కొనుగోలు ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తామని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఉద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి -** హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.ఈ హామీని నెరవేర్చే దిశగా, రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఈరోజు తొలి విడతగా రూ. 2,000 కోట్ల నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులతో రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి కీలకమైన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లించింది. రిటైర్డ్ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్ బకాయిల మొత్తాన్ని క్లియర్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి మే 2025 వరకు పెండింగ్‌లో ఉన్న కమ్యూటేషన్ బకాయిలను కూడా పూర్తిగా చెల్లించారు.ముందస్తు ప్రణాళికలు, పక్కా కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. ఇచ్చిన మాట ప్రకారం మిగిలిన రూ. 4,000 కోట్ల బకాయిలను కూడా నిర్ణీత గడువులోగా ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి తమ ప్రభుత్వం శరవేగంగా కసరత్తు చేస్తోందని వెల్లడించింది. ఉద్యోగుల పట్ల ప్రభుత్వం శ్రద్ధ చూపుతున్నదనడానికి ఇది నిదర్శనమని, ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఉద్యోగ సంఘాల నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు

**మొదటిపేజీ తరువాయి -** జీవనోపాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది.ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని ‘హైడ్రా ఈగిల్ టీమ్’గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు.ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు.“గతంలో బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు” అని తాన్షి రాయ్ ఆనందంగా చెప్పారు. “అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు” అని గాయత్రి తెలిపారు.ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా ‘మేము కూడా సమాజానికి సేవ చేయగలం’ అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

## కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో 'చేయూత' యాప్‌లో పెన్షన్ లబ్ధిదారుల వివరాల నమోదు



**వార్తా సంధ్య కూకట్‌పల్లి:** కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వం రూపొందించిన "చేయూత" యాప్‌లో నమోదు చేసే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ఫోటోలను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ వి.ఆర్.కె పాప గౌడ్, రిసోర్స్ పర్సన్ జానకి తదితరులు పాల్గొని ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ఆందోళన

వెంటనే ధరలు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్

మణుగూరులో నిరసన కార్యక్రమం నిర్వహించిన పార్టీ నాయకులు



**భద్రాద్రి జిల్లా బ్యూరో, తేదీ (వార్త సంధ్య) :** పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ మణుగూరులో పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ, మే 15 నుంచి మే 25 వరకు కేవలం 10 రోజుల వ్యవధిలోనే కేంద్ర ప్రభుత్వం నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని విమర్శించారు. నాలుగు విడతల్లో పెట్రోల్‌పై రూ.7.38, డీజిల్‌పై రూ.7.52 పెంచి పేద, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారాలు మోపిందన్నారు. ఇంధన ధరల పెంపుతో రవాణా చార్జీలు భారీగా పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు కూడా పెరిగే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే ధరల భారం తట్టుకోలేక సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సమయంలో కేంద్ర ప్రభుత్వం వరుసగా ధరలు పెంచడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జెల్లా అశోక్, ఆకుల సత్యనారాయణ, పి. సంజీవరెడ్డి, వంశీకృష్ణ, సతీష్ బాబు, జంపయ్య, సుధాకర్, పీవీ శ్రీనివాస్, చెట్టుపల్లి నాగేశ్వరరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుని వివాహ వేడుకలు



**మంథని, మే 29(వార్త సంధ్య) :** మంథని డివిజన్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొడారి మల్లేష్ యాదవ్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రెస్ క్లబ్ లో మీడియా మిత్రుల సమక్షంలో వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేష్ యాదవ్ శాలువాతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మేడగోని రాజమౌళి గౌడ్ మాట్లాడుతూ అందరితో కలుపుగోలుగా వివరించే మల్లేష్ యాదవ్ అనతి కాలంలోనే పత్రికా రంగంలో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మహావాది సతీష్ కుమార్ , టెలి షార్ట్ ఫిలిం డైరెక్టర్ మేడగోని రాజమౌళి గౌడ్, రామడుగు సాయి శ్రీనివాస్ , నాంపల్లి శ్రీనివాస్, ఏగోలపు సంతోష్ గౌడ్, మాదేశి శ్రావణ్ కుమార్, మంథని లక్ష్మణ్, బెజ్జంకి దిగంబర్, బిజెపి మాజీ పట్టణ అధ్యక్షుడు బూడిద తిరుపతి, గుడ్ల గురువేష్, రేపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు...

## 'ఈగిల్ టీమ్' పేరిట విధులు



తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఓ వినూత్న నిర్ణయం, సమాజంలో మార్పునకు నాంది పలుకుతోంది. హైడ్రాలో 16 మంది ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు కల్పించి, వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. ఈ చొరవ ద్వారా వారికి గౌరవప్రదమైన జీవనోపాధిని అందించి, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో భాగస్వాములను చేసింది. ఈ బృందంలో 11 మంది ట్రాన్స్ మహిళలు, ఐదుగురు ట్రాన్స్ పురుషులు ఉన్నారు. హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెరువులు, ప్రభుత్వ భూములపై అక్రమ కట్టడాలను తొలగించడంలో వీరు చురుగ్గా పాల్గొంటున్నారు. కబ్జాదారులు ఎంతటి పలుకుబడి ఉన్నవారైనా భయపడకుండా, నిర్భయంగా తమ విధులను నిర్వర్తిస్తున్నారు. వీరిని 'హైడ్రా ఈగిల్ టీమ్'గా పిలుస్తున్నారు. ఈ ఉద్యోగం తమకు కేవలం జీవనోపాధి మాత్రమే కాదని, జీవితానికి కొత్త గుర్తింపును, ఆత్మగౌరవాన్ని ఇచ్చిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా యూనిఫాం ధరించి విధులకు హాజరవడం తమకు ఎంతో గర్వకారణమని చెబుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్‌లో 862 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని, మాదాపూర్‌లోని ఎదులకుంట చెరువును కబ్జాదారుల బారి నుంచి కాపాడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషించింది. కబ్జాల తొలగింపు సమయంలో ప్రజలకు నచ్చజెప్పడం, మహిళలతో మాట్లాడి ఉద్రిక్తతలు తగ్గించడం, అధికారులు-ప్రజల మధ్య సమన్వయం చేయడంలో వీరు అద్భుతమైన నైపుణ్యం ప్రదర్శిస్తున్నారని హైడ్రా అధికారులు తెలిపారు. క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నారని ప్రశంసించారు. "గతంలో బతుకుదెరువు కోసం అడుక్కునేవాళ్లం. ఎక్కడికి వెళ్లినా హేళన చేసేవారు. పని అడిగితే ముఖం మీదే లేదనేవారు. కానీ, ఇప్పుడు యూనిఫాంలో విధులకు వెళుతుంటే అందరూ మర్యాదగా మాట్లాడుతున్నారు" అని తాన్వి రాయ్ ఆనందంగా చెప్పారు. "అవకాశం ఇస్తే ట్రాన్స్‌జెండర్లు ఏ రంగంలోనైనా రాణించగలరు. హైడ్రాలో మా విధులే దీనికి నిదర్శనం. ఇక్కడ అధికారులు, ఇతర సిబ్బంది మమ్మల్ని సమానంగా చూస్తారు" అని గాయత్రి తెలిపారు. ఈ ఉద్యోగం వల్ల వీరు ఇప్పుడు ఆర్థికంగా స్థిరపడి, తమ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు. అన్నిటికంటే ముఖ్యంగా 'మేము కూడా సమాజానికి సేవ చేయగలం' అనే ఆత్మవిశ్వాసం వారిలో వెల్లివిరుస్తోంది.

## ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

ఎస్ఐఆర్. కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పాక్షికంగా నిర్వహించాలి

ప్రతి ఇంటికి బీఎల్వో చేరుకొని పూర్తి స్థాయిలో పరిశీలన చేయాలి

డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

అభ్యంతరాలు, క్లెయిమ్‌లపై క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలి

రాజకీయ పార్టీలతో నిరంతర సమన్వయం కొనసాగించాలి

ఎస్ఐఆర్ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించిన సీఈఓ







**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే-29( వార్త సంధ్య) :** ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్ఐఆర్ కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షించారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 సార్లు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో 2002లో ఎస్ఐఆర్ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీల తొలగింపు జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు. జూన్ 24 నుండి జూలై 25 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హ ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని,1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీఎల్వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఎన్యుమరేషన్ సమయంలో ఎలాంటి ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదని తెలిపారు. ప్రతి బీఎల్వోకు ఎస్ఐఆర్ నిబంధనలు, విధివిధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 24 నుండి జూలై 25 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హ ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం మ్యాపింగ్‌లో లోపాలు ఉంటే సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. భారత పౌరసత్వ నిబంధనల ప్రకారం అవసరమైన పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. జూలై 1, 1987కు ముందు జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, తల్లిదండ్రుల పత్రాలు అవసరం లేదన్నారు. జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని, డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తల్లిదండ్రుల ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. ముసాయిదా జాబితా ప్రచురణ అనంతరం ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, కొత్త క్లెయిమ్‌లు, దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మాత్రమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుపై ఫీల్డ్ స్థాయిలో విచారణ నిర్వహించాలని, ఎటువంటి ఫిర్యాదును నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ జరుగుతుందని, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కార ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1న ప్రచురించనున్నట్లు పేర్కొన్నారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పూర్తిస్థాయి నిష్పాక్షికత పాటించాలని తెలిపారు. అన్ని పార్టీలకు సమాన దూరంలో ఉండటమే కాకుండా, అది స్పష్టంగా కనిపించేలా అధికారులు వ్యవహరించాలని ఆదేశించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రముఖుల పేర్లు మిస్ అయ్యాయనే వార్తలు రాకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఉద్యోగుల పేర్లు కూడా తప్పనిసరిగా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో లు బి. గంగయ్య, సురేష్, అందరు తహసిల్దార్ లు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

కొత్త డిపో సమీపంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

రోడ్డు ప్రమాదాలపై అంబులెన్స్ స్పందన సమయ నివేదిక సిద్ధం చేయాలి

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మే-29( వార్త సంధ్య ) :** జిల్లాలో రోడ్డు భద్రత చర్యలను పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె.అరుణ శ్రీతో కలిసి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కొత్త డిపో సమీపంలో బస్ స్టాండ్ రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన ప్రణాళిక రూపొందించి సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన పనులను ప్రాధాన్యతగా తీసుకుని అమలు చేయాలని తెలిపారు. ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన హెచ్చరిక బోర్డులు, ట్రాఫిక్ సూచికలు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల సమయంలో అంబులెన్స్ స్పందన సమయంపై ప్రత్యేక నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద స్థలానికి అంబులెన్స్ చేరుకునే సమయం, ఎదురవుతున్న ఇబ్బందులు, తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక అందించాలని తెలిపారు. అవసరమైన చోట్ల విద్యుత్ టవర్లు, విద్యుత్ స్తంభాలను సక్రమంగా మార్పిడి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రహదారుల పరిశుభ్రతను ప్రతిరోజూ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, చెత్త పేరుకుపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బీ ఈఈ భవ్ సింగ్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి

మోయలేని భారాలతో ఆటో కార్మికుల జీవితాలు చిన్నాభిన్నం చేస్తున్న కేంద్రం

కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పేదలను నిర్లక్ష్యం చేస్తున్న పాలకులు

కేవలం 11 రోజుల్లోనే ఐదు సార్లు ధరలు పెంచి నడ్డి విరిచిన ఎన్డీయే సర్కార్

స్వయం ఉపాధిపై ఆధారపడిన పేదలను నట్టేట ముంచుతున్న మోడీ

నిత్యం పెరుగుతున్న ఇంధన ధరలపై పోరాటాలు ఉధృతం చేస్తాం

ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అర్ధ నగ్నంగా, ఆటోలను లాగుతూ వినూత్న నిరసన



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 29 (వార్త సంధ్య) :** అడ్డగోలుగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు నిరసనగా యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణంలోని ఆటో కార్మికులు శుక్రవారం వినూత్న నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పోస్టాఫీసు సెంటర్ నుంచి బస్టాండు సెంటర్ వరకు అర్ధ నగ్నంగా ఆటోలకు తాడుకట్టి లాగుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ స్వయం ఉపాధిపై ఆధారపడి జీవిస్తున్న ఆటో కార్మికులపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోయలేని భారం మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేస్తూ పేదలను నట్టేట ముంచుతోందని తీవ్ర స్థాయిలో విమర్శించారు. కేవలం 11 రోజుల్లోనే ఐదు సార్లు డీజిల్ ధర పెంచి ఆటో కార్మికుల నడ్డివిరిచారని మండిపడ్డారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. లాక్‌డౌన్ కష్టాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ఆటో కార్మికులను ఈ ధరల పెరుగుదల మరింత కుంగదీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎక్సైజ్ సుంకాలను తగ్గించి, కార్మికులను ఆదుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మర్రి కృష్ణ, అబ్బులు, మంద శ్రీను, బాబు జానీ, ఆరెల్లి, కృష్ణ, రాంబాబు, దేశీ, బడుగు భాస్కర్, చింటూ, లక్ష్మణ్, సంపత్, విజ్జి, మండల రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండించిన చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేస్తాం

కొత్తగూడెం సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు భరోసా

సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఆకస్మిక తనిఖీ

అకాల వర్షాలతో రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

దళారులను ఆశ్రయించకుండా రైతులు మద్దతు ధర పొందాలని సూచన

ఇప్పటివరకు కోట్ల రూపాయల విలువైన ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసిన సొసైటీ

**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 29 (వార్త సంధ్య) :** రైతు పండించిన చివరి ధాన్యపు గింజ వరకు కొనుగోలు చేయుటకు ప్రభుత్వం, సహకార సంఘం సిద్ధంగా ఉన్నాయని కొత్తగూడెం





సొసైటీ చైర్మన్ మండే వీర హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు ఆయన సుజాతనగర్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి రైతుల పరిస్థితిని తెలుసుకున్నారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో వివరాలు సేకరించారు. రైతులు ఎవరూ అధైర్యపడవద్దని, ప్రభుత్వం ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందని భరోసా కల్పించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా మండే వీర హనుమంత రావు మాట్లాడుతూ, ఇప్పటివరకు కొత్తగూడెం సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 10 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 21,968 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని తెలిపారు. దీని విలువ సుమారు రూ.5 కోట్ల 20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రెండు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ద్వారా 5,380 క్వింటాళ్ల మొక్కజొన్నను కొనుగోలు చేసి, దాదాపు రూ.12 కోట్ల 80 లక్షల మేర రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి రైతుకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోరం కనకయ్యపై అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండిస్తున్నాం

**బీఆర్ఎస్ నాయకులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయండి**

**గిరిజన ప్రజా ప్రతినిధి గౌరవాన్ని దెబ్బతీసే కుట్రలను సహించం**

**వ్యక్తిగత దూషణలు బీఆర్ఎస్ దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనం**

**డీఎస్పీకి అధికారిక ఫిర్యాదు చేసిన పట్టణ కాంగ్రెస్ నాయకులు**

**గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలపై ఆగ్రహం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 29 (వార్త సంధ్య) :** ఎస్టీ ఆదివాసి వర్గానికి చెందిన ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య గారు, వారి కుటుంబ సభ్యులపై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొందరు నాయకులు చేస్తున్న అసత్య, నిరాధార, రాజకీయ దుష్ప్రచారాలను ఇల్లందు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండి స్తున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బోళ్ల సూర్యం, 20వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ జాఫర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు ఇల్లందు డీఎస్పీ వెంకన్న బాబు గారిని కలిసి ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య గారి గౌరవాన్ని దెబ్బతీసేలా, కుటుంబ సభ్యులపై కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తూ సామాజికంగా, రాజకీయంగా అవమానించే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు సిలువేలు సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్కే చాంద్ పాషా, గిన్నారపు రాజేష్, సత్తాల హరీష్ తదితరులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కిందతో పాటు ఇతర క్రిమినల్ చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక గిరిజన ప్రజా ప్రతినిధి ఎదుగుదలను జీర్ణించుకోలేక కుట్రపూరితంగా వ్యక్తిగత దూషణలకు దిగడం అత్యంత బాధాకరమని, ఖండనీయమని పేర్కొన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, గిరిజనుల ఆత్మగౌరవాన్ని కించపరిచే వ్యాఖ్యలు ఏ రూపంలో వచ్చినా కాంగ్రెస్ పార్టీ సహించబోదని హెచ్చరించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలు, తప్పుడు ప్రచారాలు చేయడం బీఆర్ఎస్ నాయకుల దివాళాకోరు రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ఇలాంటి చర్యలు వెంటనే ఆపకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, గిరిజన సమాజాన్ని అవమానించే వారిపై చట్టపరంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# కేటీఆర్ కు మంత్రి పొంగులేటి సవాల్

**గ్రామాల్లో ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్లు కట్టిందేమీ లేదు**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 29.** : ఇంకా ఎన్నికల లోపు 2.5 సంవత్సరాలు ఉంది. మీరు కేటీఆర్ హైదరాబాద్ లో ఏవైతే ఇండ్లు కట్టాము అని చెప్పుకుంటున్నారో.. బీఆర్ఎస్ కట్టినదాని కంటే, కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ ఇండ్లు కడితేనే.. ఎక్కువ కట్టిందని ప్రజలు హర్షిస్తేనే, వచ్చే ఎన్నికల్లో నేను ఎమ్మెల్యేగా పోటీ చేస్తా. ఎక్కువ ఇండ్లు కట్టలేకపోతే నేను పోటీ చేయను కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ లో ఎక్కువ ఇండ్లు కడితే.. ఎమ్మెల్యేగా పోటీ చేయకుండా మీరు ఆగగలుగుతారా అని కేటీఆర్ కు సవాల్ విసురుతున్నా..

# గురుకులాల్లో సీట్ల భర్తీకి భారీ స్పందన

**ఫేజ్-1లోనే 18,401 సీట్లు భర్తీ**

**పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం**

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మే 29 :** తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక పాఠశాలలు, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ , సి ఓ ఈ నాన్-సీఓఈ మరియు ఒకేషనల్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలను శుక్రవారం డా.బి . అర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.... ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారు విద్యను సామాజిక మార్పుకు ప్రధాన సాధనంగా భావిస్తూ పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి నాణ్యమైన విద్యను పూర్తిగా ఉచితంగా అందించేందుకు కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థలను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చారిత్రాత్మక చర్యలు తీసుకుంటోందన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ 5న ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయగా, ఏప్రిల్ 6 నుంచి మే 25 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 45,357 దరఖాస్తులు అందగా, అందులో ఎంపీసీ గ్రూప్‌కు 21,447, బైపిసి గ్రూప్‌కు 17,400, , ఎం ఈ సి, సి ఈ సి, హెచ్ ఈ సి గ్రూపులకు కలిపి 6,510 దరఖాస్తులు వచ్చినట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల విద్యాసంస్థల్లో మొత్తం 19,740 సీట్లు అందుబాటులో ఉండగా, మే 15న 117 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 39,052 మంది విద్యార్థులు హాజరై 86.09 శాతం హాజరు నమోదైనట్లు వెల్లడించారు. ఫేజ్-1 అడ్మిషన్లలోనే మొత్తం 18,401 సీట్లు భర్తీ కావడం గురుకులాలపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ఇంకా 1,339 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు.

**గ్రూపుల వారీగా సీట్ల భర్తీ వివరాలు**

- **ఎంపీసీ: 8,440 సీట్లకు గాను 8,156 సీట్లు భర్తీ --- 96.63%**
- **దీఖూజ : 8,280 సీట్లకు గాను 7,425 సీట్లు భర్తీ : 90.00%**
- **ఎం ఈ సి : 520 సీట్లకు గాను 377 సీట్లు భర్తీ : 72.00%**
- **సి ఈ సి : 1,520 సీట్లకు గాను 1,500 సీట్లు భర్తీ : 98.68%**
- **హెచ్ ఈ సి: 280 సీట్లకు గాను 257 సీట్లు భర్తీ : 98%**
- **ఒకేషనల్ కోర్స్: 700 సీట్లకు గాను 686**

**మొత్తం అన్ని గ్రూప్ లలో సీట్లు భర్తీ : 93.21%**

ఫేజ్-1లో ఎంపికైన విద్యార్థులు అవసరమైన ధ్రువపత్రాలతో జూన్ 7లోపు సంబంధిత కళాశాలల్లో ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. జూన్ 1 నుంచి కళాశాలలు ప్రారంభమవుతున్నందున విద్యార్థులను మొదటి రోజే కళాశాలలకు పంపించాలని మంత్రి కోరారు.సోషల్ వెల్ఫేర్ గురుకులాలు నేడు జాతీయ స్థాయిలో అద్భుత ఫలితాలు సాధిస్తున్నాయని మంత్రి తెలిపారు. జేఈఈ మెయిన్-2026లో 337 మంది విద్యార్థులు అర్హత సాధించగా, అందులో 26 మంది 90 శాతం పైగా పర్సంటైల్ సాధించడం గర్వకారణమన్నారు. గత ఏడాది 525 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ కు అర్హత సాధించడం గురుకుల విద్యా వ్యవస్థ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కళాశాలలు ఐఐటి జేఈఈ నీట్ ఎన్ డి ఏ జాతీయ స్థాయి పరీక్షల్లో కార్పొరేట్ కళాశాలలకు పోటీగా ఫలితాలు సాధిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ, దళిత, గిరిజన ప్రాంతాల విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి వారిని జాతీయ స్థాయిలో నిలబెడుతున్నామని అన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న మైక్రో అకడమిక్ ప్లానింగ్, వారానికొకసారి మాక్ టెస్టులు, ప్రత్యేక అకడమిక్ మానిటరింగ్, నిపుణులైన అధ్యాపకులతో ప్రత్యేక శిక్షణ వల్ల ఫలితాలు గణనీయంగా మెరుగుపడుతున్నాయని మంత్రి వెల్లడించారు. విద్యార్థులకు మానసిక దృఢత్వం, కౌన్సెలింగ్, వెల్‌నెస్ కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. గురుకులాలకు సంబంధించి పెండింగ్ బిల్లులు లేకుండా ప్రతి నెల మొదటి వారంలోనే బిల్లులు చెల్లించే విధంగా ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని మంత్రి పేర్కొన్నారు. ఇకపై ప్రతి నెల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామని వెల్లడించారు. విద్యతోనే సామాజిక అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం విశ్వసిస్తోందని, పేద కుటుంబాల పిల్లలను దేశ భవిష్యత్ శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఓ ఎస్ డివై.జె. విజయ్ కుమార్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి ఎఫ్ ఏసీ కంభంపాటి శారద, జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, అసిస్టెంట్ సెక్రటరీ మధు నాయక్, డిప్యూటీ సెక్రటరీ సహజ, సూపరింటెండెంట్ మృణాళిని, డిపిఓ శ్రీకాంత్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలపై మైన్స్ కమిటీలో యాజమాన్యంతో ఎఐటీయూసీ చర్చలు

**గని పరిసరాల్లో మౌలిక సదుపాయాల లోపాలపై ఆందోళన**

**వర్షాకాలానికి ముందే డ్రైనేజీ, నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని డిమాండ్**

**కార్మికుల భద్రత, పరిశుభ్రతపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచన**

**"కార్మిక సంక్షేమమే ఉత్పత్తి లక్ష్యాలకు పునాది" -- ఎఐటీయూసీ నాయకులు**






**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 29 (వార్త సంధ్య) :** కొత్తగూడెం ఏరియా పీవీకే-5 ఇంక్లైన్‌లో శుక్రవారం ఉదయం నిర్వహించిన మైన్స్ కమిటీ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, గని పరిసరాల్లో ఉన్న మౌలిక సదుపాయాల లోపాలు, భద్రతా అంశాలు మరియు కార్మిక సంక్షేమానికి సంబంధించిన విషయాలపై గుర్తింపు సంఘం ఎఐటీయూసీ నాయకులు యాజమాన్యంతో సవివరంగా చర్చించారు. ఈ సమావేశానికి సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్ నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఎఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ, సింగరేణి సంస్థ అభివృద్ధి, ఉత్పత్తి లక్ష్యాల సాధనలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. గనుల్లో ప్రతిరోజూ ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు తగిన సంక్షేమ సదుపాయాలు, పరిశుభ్రమైన వాతావరణం, భద్రతా ప్రమాణాలు మరియు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం యాజమాన్య బాధ్యత అని స్పష్టం చేశారు. కార్మికుడు ఆరోగ్యంగా, మానసికంగా ప్రశాంతంగా ఉంటేనే గైర్హాజరు కాకుండా విధులకు హాజరవుతూ సంస్థ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో భాగస్వామి అవుతాడని తెలిపారు. ప్రత్యేకంగా గని పరిసరాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మైన్స్ కమిటీ సభ్యులు, గని మేనేజర్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. మాన్‌వేకు వచ్చే దారిలో వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉందని గుర్తించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే డ్రైనేజీ మరియు నీటి మళ్లింపు చర్యలు చేపట్టాలని యాజమాన్యాన్ని కోరారు. అలాగే స్నానాల గదులు, కార్మికులు ఉపయోగించే సాధారణ ప్రదేశాల్లో ప్రతిరోజూ శుభ్రత నిర్వహించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిశుభ్రత లోపిస్తే కార్మికుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుందని, అలాంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని ఎఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రతి కార్మికుడికి అండగా నిలిచి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని తెలిపారు. గనుల్లో పనిచేసే ప్రతి కార్మికుడి సంక్షేమం, భద్రత, ఆరోగ్యం విషయంలో యాజమాన్యం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ శ్యాంప్రసాద్, ఎస్ఓ అనిల్ సాగర్, ఎల్‌హెచ్‌డీ మరియు కామన్ సెక్షన్ ఇంచార్జి శ్రవణ్, యాక్టింగ్ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేష్, ఎఐటీయూసీ పిట్ కార్యదర్శి భూక్యా రమేష్, మైన్స్ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, సందీప్, సుమన్, సురేందర్ రెడ్డి, దేవుసింగ్, కె. రాంచందర్, శశివర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇంధన ధరల మోతతో ఆటో కార్మికుల జీవితం రోడ్డున

**పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో సామాన్యుడికి తీరని భారం**

**ఆటో డ్రైవర్లకు సబ్సిడీ డీజిల్ లేదా మీటర్ ఛార్జీల పెంపు అవసరం**


**నిత్యావసర ధరల పెరుగుదలతో కుటుంబ పోషణ కష్టసాధ్యమైందన్న ఆవేదన**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్**

**పెరిగిన ఖర్చులతో అప్పుల పాలవుతున్న ఆటో కార్మికులు**

**రోజంతా కష్టపడినా చేతికి మిగిలేది తక్కువేనంటున్న డ్రైవర్లు**

**ఆటో కార్మికుల సమస్య పై నేడు ప్రత్యేక కథనం**




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 29 (వార్త సంధ్య) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆటో డ్రైవర్ల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు ఒకవైపు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల మరోవైపు ఆటో కార్మికుల జీవితాలను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తున్నాయి. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా గిరాకీ లేకపోవడంతో రోజంతా ఆటో నడిపినా కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం రావడం లేదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డీజిల్, పెట్రోల్ ధరలు భారీగా పెరగడంతో ఆటోలను నడపడం భారంగా మారిందని డ్రైవర్లు చెబుతున్నారు. వాహనాల ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మరమ్మత్తుల ఖర్చులు, టైర్లు, స్పేర్ పార్ట్స్ ధరలు కూడా పెరగడంతో చేతికి వచ్చే ఆదాయం మొత్తం ఖర్చులకే సరిపోతుందని అంటున్నారు. చాలామంది ఆటో కార్మికులు అప్పులు చేసి వాహనాలు కొనుగోలు చేయగా, నెలసరి వాయిదాలు చెల్లించడమే కష్టంగా మారిందని పేర్కొంటున్నారు. గతంలో ఉదయం నుంచి రాత్రివరకు ఆటో నడిపితే కుటుంబ అవసరాలు తీరేవని, ప్రస్తుతం రోజంతా శ్రమించినా పిల్లల చదువులు, ఇంటి అద్దె, కిరాణా ఖర్చులు భరించడం కష్టమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రయాణికుల సంఖ్య తగ్గిపోవడం, షేర్ ఆటోలు మరియు ఇతర రవాణా సౌకర్యాలు పెరగడం వల్ల ఆదాయం మరింత తగ్గిందని తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం అత్యవసరంగా గుర్తించి ఉపశమనం కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఆటోలకు సబ్సిడీపై డీజిల్ అందించాలనీ, లేకపోతే ఆటో మీటర్ ఛార్జీలను పెంచేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా డీజిల్, పెట్రోల్‌పై విధిస్తున్న పన్నులను తగ్గించి సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. పెరిగిన ఇంధన ధరల ప్రభావం నిత్యావసర సరుకుల ధరలపై కూడా పడుతుండడంతో పేద, మధ్యతరగతి కుటుంబాల జీవనశైలి తీవ్రంగా దెబ్బతింటోందని పేర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఇంధన ధరలను నియంత్రించడంతో పాటు ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేయాలని కోరుతున్నారు.

# సింగరేణి కార్మికుల సొంతింటి పథకం రుణం రూ.30 లక్షలకు పెంచాలి

**కంపెనీ మెయిన్ హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీగా మార్చాలి**

**కొత్త ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేయండి**

**సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారు పేరు కేసులను పరిష్కరించాలి**

**సంస్థ పరిధిలోని కాంట్రాక్ట్ కార్మికులను తక్షణమే క్రమబద్ధీకరించాలి**

**కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలి**

**కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 29 (వార్త సంధ్య) :** సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం వడ్డీ లేని గృహ సాయం రూ.10 లక్షల నుండి రూ.30 లక్షలకు పెంచాలని, 250 చదరపు గజాల ఇంటి స్థలాలతో కూడిన "సొంత ఇళ్ల పథకాన్ని" ప్రవేశపెట్టి అమలు చేయాలనీ, కొత్తగూడెం శాసనసభ సభ్యులు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు కోరారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ)ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి పనులతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్తగూడెంలోని సింగరేణి మెయిన్ హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీగా మార్చడం ద్వారా కొత్తగూడెం, ఇల్లందు, మణుగూరు ప్రాంతాల కార్మికులతో పాటు ఇతర ఏరియాల కార్మికులకు మెరుగైన వైద్యం అందుతుందని, అలాగే కొత్తగూడెంలో నూతన ఆర్టీసీ బస్ స్టాండ్ నిర్మాణానికి సింగరేణి సంస్థ తన సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) నిధుల నుండి రూ.14.00 కోట్లు మంజూరు చేయాలని కోరామన్నారు. సంస్థలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మారు పేరు కేసులను త్వరితగతిన పరిష్కరించాలని, అధికారుల పీఆర్‌పీ బకాయిలను విడుదల చేయాలని కోరారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు శాశ్వత ఉపాధి కల్పిస్తూ తక్షణమే క్రమబద్ధీకరించాలని, వేతనాలు పెంచాలని, కొత్తగూడెం నియోజకవర్గంలో రోడ్ల విస్తరణ చేపట్టాలని, బస్ స్టాండ్ నుండి త్రిమాత టెంపుల్ వరకు, హెడ్ ఆఫీస్ నుండి మెయిన్ హాస్పిటల్ వరకు లైటింగ్ ను సంస్థద్వారా తక్షణమే పనులు ప్రారంభించాలని, పోస్ట్ ఆఫీస్ సెంటర్ నుండి హేమచంద్రాపురం రోడ్డును ఫోర్-లేన్‌గా మార్చాలని, 14వ వార్డు రామాలయం నుండి ఎన్ హెచ్-30 వరకు రోడ్డు అభివృద్ధికి సహకరించాని కోరామన్నారు. బాబు క్యాంప్, రామావరంలో బీటీ రోడ్లను సీసీ రోడ్లుగా మార్చాలని, పాత దుకాణాల స్థానంలో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరారు. లీజు భూములను మున్సిపాలిటీకి అప్పగించాలని, ఉద్యోగుల బదిలీల అభ్యర్థనలను పరిశీలించాలని, పెర్క్స్ పై ఆదాయపు పన్నును రీయింబర్స్ చేయాలన్నారు. సింగరేణి బలోపేతానికి కొత్త బొగ్గు ప్రాజెక్టులు కేటాయించాలని, దివంగత జేటీఓ చల్లా రాజా శ్రీనివాస్ కుమారుడు, వినికిడి లోపం గల చల్లా భరద్వాజ్‌కు కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని కోరామని, తన ప్రతిపాదనలపై సిఎండి సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# డిఆర్ఎ ఎగ్జామ్ మాఫియా బట్టబయలు..!

**ఉద్యోగం ఆశ చూపించి యువతను దోచేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీలు**

**ముందుగా రూ.6 వేల వసూలు..**


**ఉద్యోగంలో చేరాక జీతం నుంచీ మరో రూ.6 వేల కట్**

**డబ్బులు అడిగితే బెదిరింపులు..**

**"మీ దిక్కున్న చోట చెప్పుకోండి" అంటూ దౌర్జన్యం**

**ఉద్యోగాలు లేకుండా చేస్తాం అంటూ ఉద్యోగులపై ఒత్తిడి**

**భద్రాద్రి హాల్ మార్క్ ఏజెన్సీల పై తీవ్ర ఆరోపణలు**







**భద్రాద్రి జిల్లా బ్యూరో, మే 29 (వార్త సంధ్య) :** నేటి యువత ఉద్యోగాల కోసం పడుతున్న కష్టాలను ఆసరాగా చేసుకుని కొంతమంది ప్రైవేట్ ఏజెన్సీలు కొత్త తరహా దోపిడీకి తెరలేపుతున్నాయి. సైబర్ మోసాల మాదిరిగానే ఇప్పుడు ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేసే ఘటనలు పెరుగుతున్నాయి. తాజాగా డెబిట్ రికవరీ ఏజెంట్ (డిఆర్ఎ) పరీక్ష పేరుతో భారీగా డబ్బులు వసూలు చేస్తూ, తర్వాత బెదిరింపులకు దిగుతున్న ఘటన ఖమ్మం మరియు భద్రాద్రి జిల్లాలో వెలుగులోకి రావడం కలకలం రేపుతోంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ (ఐఐబిఎఫ్) నిబంధనల ప్రకారం బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల రికవరీ విభాగాల్లో పని చేయాలంటే డిఆర్ఎ సర్టిఫికేషన్ తప్పనిసరి. ఆర్బీఐ మార్గదర్శకాల ప్రకారం ఈ అర్హత లేకుండా రికవరీ విధులు నిర్వహించరాదు. ఈ నిబంధనను కొంతమంది థర్డ్ పార్టీ ఏజెన్సీలు వ్యాపారంగా మార్చుకున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖమ్మంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా క్రెడిట్ కార్డు బకాయిల వసూళ్ల కోసం పనిచేస్తున్న 'హాల్ మార్క్ ఏజెన్సీ' అనే సంస్థ ఉద్యోగార్థుల నుంచి డిఆర్ఎ ఎగ్జామ్, ట్రైనింగ్ పేరుతో ముందుగానే రూ.6 వేల చొప్పున వసూలు చేస్తున్నట్లు బాధితులు చెబుతున్నారు. "పరీక్షలో పాస్ అయితేనే ఉద్యోగం కొనసాగుతుంది" అని చెప్పి డబ్బులు తీసుకుంటున్నారని సమాచారం. ఇక్కడితో ఆగకుండా ఉద్యోగంలో చేరిన తర్వాత మొదటి జీతం నుంచి మరోసారి రూ.6 వేల వరకు కట్ చేస్తున్నారని ఉద్యోగులు వాపోతున్నారు. "ముందుగా కట్టిన డబ్బులు తర్వాత తిరిగి ఇస్తాం" అని నమ్మబలికి, తర్వాత అడిగితే "వచ్చేవి ఇచ్చేవి ఏమీ లేవు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. డబ్బుల గురించి ప్రశ్నించిన వారిని మరింత భయాందోళనలకు గురి చేస్తున్నారని ఉద్యోగులు చెబుతున్నారు. "మీ దిక్కున్న చోట చెప్పుకోండి", "వరంగల్ నుంచి ఒక్క ఫోన్ చేస్తే మీకు ఎక్కడా ఉద్యోగాలు దొరకకుండా చేస్తాం" అంటూ బెదిరింపులకు దిగుతున్నారని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగం కోల్పోతామనే భయంతో చాలా మంది బయటకు రావడానికి కూడా భయపడుతున్నారని తెలిసింది. కొంతమంది యువకులు అప్పులు చేసి ఫీజులు చెల్లించగా, ఇప్పుడు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంపై కార్మిక శాఖ, బ్యాంకింగ్ సంబంధిత అధికారులు, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి, ఉద్యోగుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# 'బంగారు'కొండలా మారిన రాయదుర్గం భూములు

**9 ఏళ్లలో 6 రెట్లు పెరిగిన ఎకరం రేటు**

**ఇంతింతై తొమ్మిదేళ్లలో ఆరింతలైన భూముల విలువ**

**గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ల రాకతో రాయదుర్గంలో భూములకు పెరిగిన డిమాండ్**

**కోకాపేటను వెనక్కి నెట్టిన ఐటీ హబ్ భూములు**



రాయదుర్గం భూములు బంగారం కంటే ఎంతో విలువైనవిగా మారిపోయాయి. గజం భూమి ధర ఏకంగా రూ.5 లక్షలు పలుకుతోంది. ఐటీ, నివాస కేంద్రాలకు నిలయంగా ఉన్న ఈ ప్రాంతానికి ప్రస్తుతం హైదరాబాద్‌లో అత్యధిక డిమాండ్ ఉంది. మార్కెట్ కొంతకాలంగా స్తబ్దుగా ఉందని చెబుతున్న సమయంలో రాయదుర్గంలో ఎకరా భూమి ఏకంగా రూ.237 కోట్లు పలికి మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇది దేశంలోనే కాదు, ఆసియాలోనే ఒక మైలు రాయి అని రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.హైదరాబాద్ నగరం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)కు ప్రధాన కేంద్రంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మల్టీ నేషనల్ కంపెనీలు ఐటీ, ఐటీ ఆధారిత సంస్థలు, ఫార్మా, ఫైనాన్స్ సంస్థలు తమ జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్‌ను అనువైన కేంద్రంగా భావిస్తున్నాయి. వారానికి ఒక జీసీసీని భాగ్యనగరంలో ఏర్పాటు చేస్తున్నాయి. భవిష్యత్తులో మరిన్ని పెద్ద పెద్ద సంస్థలు వచ్చే అవకాశం ఉండటంతో డెవలపర్లు ఈ ప్రాంతంలో హౌసింగ్, కమర్షియల్ ప్రాజెక్ట్‌ల కోసం వేలంలో పోటాపోటీగా వేలం పాడి భూములను దక్కించుకుంటున్నారు.జీసీసీల కోసం ఆఫీస్ స్పేస్‌కు భారీ స్థాయిలో డిమాండ్ ఉండటం, తద్వారా రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లకు డిమాండ్ పెరగనుందని నిపుణులు అంటున్నారు. ఎగువ మధ్య తరగతి, ఆపై వర్గాలకు తగ్గ నివాసాల విభాగంలో చేపట్టిన ప్రాజెక్ట్‌లకు కొనుగోలుదారుల నుంచి ఆశించిన మేరకు స్పందన ఉందని ఒక బిల్డర్ చెబుతున్నారు. 2017లో ఇక్కడ ఎకరం రూ.42.59 కోట్లు ఉంటే, ఇప్పుడు రూ.237 కోట్లకు పెరిగిందంటే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. అంటే తొమ్మిదేళ్లలో దాదాపు 6 రెట్ల చొప్పున పెరిగింది.తెలంగాణ రైజింగ్-2047 దిశగా తమ ప్రభుత్వం చూపుతున్న దూర దృష్టి, పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణంతో హైదరాబాద్ భవిష్యత్తుపై పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెంపొందించగలిగామని, అందుకు నిదర్శనమే వేలంలో భూములకు పలికిన ధరలని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.'రాయదుర్గం 'ఏ' గ్రేడ్ ఆఫీస్‌లకు హబ్‌గా మారింది. నెలకు చదరపు అడుగు అద్దె రూ.100 అయ్యింది. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 3.4 మిలియన్ చదరపు అడుగుల లీజింగ్ జరిగింది. డిమాండ్ ఉండటంతో ఆఫీస్‌ల నిర్మాణాల కోసం అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారని నరెడ్కో తెలంగాణ ప్రెసిడెంట్ కె.శ్రీధర్ రెడ్డి అన్నారు.రాయదుర్గం నాలెడ్జి సిటీ పక్కనే ఈ భూమి ఉండటం, రెండు వైపులా రహదారి కావడంతో ఆఫీస్‌ల నిర్మాణానికి అనువుగా ఉంటుంది. స్టార్ హోటళ్లు, పెద్ద పెద్ద కాంప్లెక్సులు, మాల్స్ పక్కనే ఉండటంతో కంపెనీలు సైతం ఆఫీస్ స్పేస్ లీజింగ్‌కు రాయదుర్గం వైపు చూస్తున్నాయి. ఇక్కడ చదరపు అడుగు రూ.20 వేల వరకు అమ్ముతున్నారని క్రెడాయ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎన్.జైదీప్ రెడ్డి తెలిపారు.గతంలో హెచ్ఎండీఏ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములకు ఈ-వేలం వేసినప్పుడు ధర భారీగా పెంచి తర్వాత విరమించుకున్నారు. హెచ్ఎండీఏ భూముల పక్కన ఉన్న తమ ల్యాండ్ ధరలు పెంచుకునేందుకు కొంతమంది ఇలా వేలం పాటలో పాల్గొని కావాలనే కృత్రిమంగా ధరలు పెంచుతున్నారనే ఆరోపణలు పెద్ద ఎత్తున ఉన్నాయి. ఒకసారి బిడ్ డాక్యుమెంట్ (జీఎస్టీతో కలిపి) చెల్లించిన తర్వాత తిరిగి వాపసు చేసే ప్రక్రియ ఉండదు.

# ఈదురు గాలుల బీభత్సం

**తాటిచెట్టు పడి ఇద్దరు స్నేహితులు మృతి**

**కుమ్మరిపాలెంలో తాటిచెట్టు కూలి ఇద్దరు మృతి**

**ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ దిగ్భ్రాంతి**

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వ అండగా ఉంటుందని భరోసా**



కృష్ణాజిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లి శివారు కుమ్మరిపాలెం గ్రామంలో అర్ధరాత్రి విషాదం చోటుచేసుకుంది. ఉన్నట్టుండి మారిన వాతావరణం, ఈదురుగాలుల ధాటికి రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టు కూలడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు స్నేహితులు దుర్మరణం చెందారు.ఇంటికి చేరేలోపే మృత్యువు: కుమ్మరిపాలెం గ్రామానికి చెందిన గరికపాటి మనోహర్ (33), చుటూరు శివరామకృష్ణ (27) ఇద్దరూ ప్రాణ స్నేహితులు. శివరామకృష్ణ ముంబైలో ఉద్యోగం చేస్తుండగా వారం క్రితమే స్వగ్రామానికి వచ్చాడు. శనివారం రాత్రి ఇద్దరూ చల్లపల్లి వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. గ్రామానికి చేరువలో ఉండగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చిమ్మచీకట్లోనే వాహనాన్ని నడుపుతుండగా మనోహర్ ఇల్లు ఇంకో నిమిషంలో చేరుకునే దూరంలో ఉండగా ప్రమాదం చోటుచేసుకుంది.అక్కడికక్కడే మృతి: గాలి ఉద్ధృతికి రహదారి పక్కనున్న తాటిచెట్టు ఒక్కసారిగా ఒరిగి వారి ద్విచక్ర వాహనంపై పడింది. నేరుగా వెనుక కూర్చున్న మనోహర్‌పై చెట్టు పడటంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. వాహనం నడుపుతున్న శివరామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.మనోహర్‌కు వివాహమై భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. శివరామకృష్ణ అవివాహితుడు. సరదాగా బయటకు వెళ్లిన స్నేహితులు కళ్లెదుటే ఇలా దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరు కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ఏరియా ఆసుపత్రికి తరలించారు.భారీ ఈదురు గాలులకు తాటిచెట్టు పడి ఇద్దరు యువకులు దుర్మరణం చెందిన వార్త తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నిమ్స్‌లో అత్యాధునిక క్యాన్సర్ చికిత్స

**ఖరీదైన ఆ పరీక్షలన్నీ నేటి నుంచి ఫ్రీ**

**నేటి నుంచి అత్యాధునిక ఎన్‌జీఎస్ సేవలు అందుబాటులోకి**

**రూ.వేల ఖరీదైన పరీక్షలు ఉచితంగా నిర్వహణ**

**స్టేజ్-4 క్యాన్సర్ రోగులకు ఉపయుక్తం**




ఆధునిక క్యాన్సర్ చికిత్సలకు నిమ్స్ శ్రీకారం చుట్టింది. తాజాగా నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. కొన్నాళ్ల క్రితమే చేపట్టిన ప్రయోగాత్మక పరీక్షలు ఇప్పుడు విజయవంతమవడంతో శుక్రవారం నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభించనున్నారు. మొదటి విడతలో వందల మంది రోగుల శాంపిళ్లను ఎన్‌జీఎస్ మిషన్‌పై విజయవంతంగా పరీక్షించారు. వారందరికీ ఆధునిక క్యాన్సర్ చికిత్సలు అందించనున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ అత్యాధునిక జన్యుపరీక్షను ప్రారంభించడం రాష్ట్రంలో ఇదే తొలిసారి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చయ్యే ఈ పరీక్షను ఆరోగ్యశ్రీ కింద పేదలకు ఉచితంగా చేయనున్నారు.ఇంత వరకు ఒకే రకం క్యాన్సర్ సోకిన వారికి ఒకేరకం మెడిసన్ ఉండేది. కానీ అది కొంత మందికి పని చేయకపోవడంతో ఆ వ్యాధి మరింత ఎక్కువ అవుతుంది. దీనికి కారణం రోగుల్లో జన్యులోపం వేర్వేరుగా ఉండటమే. ఉదాహరణకు ఇద్దరు వ్యక్తులకు ఊపిరితిత్తుల క్యాన్సర్ వస్తే వారిలో ఒకరికి ఈజీఎఫ్ఆర్ జన్యువు మారితే, మరొకరిలో ఏఎల్‌కే జన్యువు ఉండే అవకాశం ఉంది. ఈ తేడాను ఎన్‌జీఎస్ పరీక్షతో తెలుసుకోవచ్చు. క్యాన్సర్‌తో ఏ జన్యువు పాడైంది. ఏ జన్యువు ఎక్కువ మ్యుటేషన్‌కు గురై క్యాన్సర్‌కు కారణమైందో కచ్చితంగా గుర్తించవచ్చు. ఈ ఔషధంతో ఆ జన్యువుపైనే నేరుగా దాడి చేసే టార్గెటెడ్ థెరపీ, పర్సనలైజ్డ్ మందులను వైద్యులు సిఫార్సు చేయొచ్చు. ముఖ్యంగా స్టేజ్-4 ఊపిరితిత్తులు, పెద్దపేగు, అండాశయ క్యాన్సర్లు, రొమ్ము, కీమోథెరపీ విఫలమైన వారికి ఎక్కువ ఉపయోగం ఉంటుందని డాక్టర్లు పేర్కొన్నారు.అన్ని ఆశలు వదులుకునే నాలుగో దశ క్యాన్సర్లలో ఉన్న ప్రస్తుతం ఇమ్యునోథెరపీ పెద్దది. శరీరంలోని వ్యాధి నిరోధక టి-కణాలు ప్రేరేపించి క్యాన్సర్‌ను నియంత్రించేందుకు ఈ మందులు పనిచేస్తాయి. రూ.లక్షల విలువైన మందులు పనిచేస్తాయో లేదో తెలుసుకోకుండా గుడ్డిగా సిఫార్సు చేస్తే పెషేంట్‌కి నష్టం కలగవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్‌జీఎస్ పరీక్ష కీలకం. క్యాన్సర్ కాదు నివ్యాధికి చికిత్సేర్ధారణ పరీక్షలు సైతం అత్యంత ఖరీదైనవే. చికిత్సలో భాగంగా ఇచ్చే రకరకాల మందులు శరీరాన్ని పాడుచేస్తోంది. గతంలో మ్యుటేషన్లకు అనుగుణంగా చికిత్స అందిస్తున్నారు. అయితే మ్యూటేషన్ల నిర్ధారణ చేసే పరీక్షలు ఖరీదు వేల రూపాయలు ఉంటుంది. అలాంటిది ఇటీవల ఖరీదైన వైద్య పరీక్షలను తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఉచితంగా నిమ్స్ అందిస్తోంది.హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో అత్యాధునిక వైద్య సేవల విస్తరణ వేగం అందుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఢిల్లీ ఎయిమ్స్ స్థాయిలో నిమ్స్ సేవలు అందించేలా చర్యలు తీసుకుంటోంది. సేవల ఆధునికీకరణతోపాటు పరిశోధనలకు పెద్దపేట వేయనున్నారు. రేవంత్‌రెడ్డి సూచనలతో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తరచూ అధికారులతో సమీక్షిస్తూ నిమ్స్‌కు ఆధునిక వసతులు కల్పించే దిశగా కృషి చేస్తున్నారు. గత రెండేళ్లలో ప్రభుత్వ బడ్జెట్, సీఎస్ఆర్ తదితర వనరుల ద్వారా సమకూరిన నిధుల్లో రూ.150 కోట్లకు పైగా వెచ్చించి ఆధునిక సౌకర్యాలు ఏర్పాటు చేశారు.మరోవైపు ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ కారణంగా దగ్గు, ఆయాసం లాంటి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. మెడిసిన్ వాడితే తగ్గిపోతాయి. అరుదైన పల్మనరీ అల్వియోలార్ ప్రొటినోసిన్ సమస్యకు మాత్రం ఇప్పటివరకు సరైన మందులు లేవు. దీనికి ఉన్న ఏకైక మార్గం ఊపిరితిత్తులను కడగడం. ప్రస్తుతం నిమ్స్ హాస్పిటల్‌లోనూ అందుబాటులోకి వచ్చింది. మనం పీల్చుకునే ఆక్సిజన్ ఊపిరితిత్తుల్లోని గాలి సంచులు ద్వారా బ్లడ్‌లో కలిసిపోయి శరీర భాగాలన్నింటికీ సరఫరా అవుతుంది.

# రాష్ట్రంలో గాలివాన బీభత్సం
# నేలకూలిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

**రాష్ట్రవ్యాప్తంగా హడలెత్తిచిన గాలివాన**

**ఈదురు గాలులతో కురిసిన వర్షానికి నేలకొరిగిన భారీ వృక్షాలు**

**వేసవి ఉక్కపోతతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడిన వైనం**



రాష్ట్రవ్యాప్తంగా గాలివాన హడలెత్తిచింది. గురువారం ఉదయం నుంచి వేసవి ఉక్కపోతతో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి భారీ వృక్షాలు నేలకొరిగాయి. పలుచోట్ల ప్రధాన రహదారులపై చెట్లు విరిగిపడగా మరికొన్ని చోట్ల వడగళ్ల వాన దంచికొట్టింది. విద్యుత్ లైన్లు తెగిపడి సరఫరా నిలిచిపోయింది.తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ ఈదురుగాలి, వడగళ్ల వాన కురిసింది. చెట్లు, కరెంట్ స్తంభాలు నేలకొరగటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కోనసీమలో సుడిగాలి బీభత్సం సృష్టించింది. కొత్తపేట వద్ద పలివెల సమీపంలో బైక్‌పై భారీ వృక్షం పడటంతో వాహనదారుడికి తీవ్రగాయాలయ్యాయి. భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో భారీ వడగళ్ల వాన కురిసింది. హుకుంపేట మండలం ఉక్కుర్భ, మెట్టు రహదారి మల్లెల తివాచీపరిచినట్టుగా వడగళ్లతో నిండిపోయింది. కోడిలి గ్రామంలో భారీ సైజులో వడగళ్లు పడ్డాయి. సుమారు గంటపాటు కురిసిన వర్షానికి ఏజెన్సీ చల్లబడింది.ఎన్టీఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో ఉరుములు మెరుపులతో కూడిన గాలి వానకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గన్నవరం పరిసరాల్లో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు హోర్డింగులు నేలకులాయి. కడప జిల్లా మైదుకూరులో ఈదురుగాలులు స్థానికలను వణికించాయి. దువ్వూరు మండలం పెద్ద జొన్నవరం, మీర్జాఖాన్ పల్లె ప్రాంతాల్లో వడగళ్ల వర్షం పడింది.పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలో గురువారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. నాదెండ్ల మండలం గణపవరం గ్రామం బొడ్రాయి సెంటర్లో భారీ ఈదురు గాలులు, వర్షానికి ఆలయ ధ్వజస్తంభం విరిగిపడింది. దీంతో విద్యుత్ తీగలు తెగి ఆ ప్రాంతంలో సరఫరా నిలిచిపోయింది. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ముప్పు తప్పింది. చిలకలూరిపేట పట్టణంలో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరా తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి 10:30కు సరఫరా నిలిచిపోయింది. నేడు(శుక్రవారం) తెల్లవారుజామున 2.30 కి కూడా సరఫరా పునరుద్ధరించలేదు. పైనుంచి వచ్చే విద్యుత్ సరఫరా లైను ఎక్కడ అంతరాయం ఏర్పడిందో అర్థం కాక విద్యుత్ అధికారులు వెతుకులాట ప్రారంభించారు.బాపట్ల జిల్లా చీరాల, పర్చూరు నియోజకవర్గాల్లో గురువారం ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అయితే రాత్రి 8 గంటల తర్వాత ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చల్లటి ఈదురు గాలులులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఒక్కసారిగా బలంగా వీచిన ఈదురు గాలులతో దుమ్ము, ధూళి ఎగిసిపడటంతో ప్రయాణికులు, వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అక్కడక్కడా హోర్డింగులు విరిగిపడ్డాయి.కోనసీమ ప్రాంతంలో గురువారం రాత్రి 8:30 గంటలకు బలమైన సుడిగాలి బీభత్సం సృష్టించింది. పలుచోట్ల చెట్లు చెట్ల కొమ్మలు పడిపోయి విద్యుత్ సరఫరాకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. కొత్తపేట వద్ద పలివెల సమీపంలో ఒక భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడుపై చెట్టు పడిపోవటంతో ఆ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. కోనసీమ వ్యాప్తంగా పలుచోట్ల చెట్లు పడిపోయాయి.కడప జిల్లా మైదుకూరు ప్రాంతంలో గురువారం రాత్రి ఉరుములు మెరుపులు, పెనుగాలులతో కూడిన వర్షం కురిసింది. దువ్వూరు మండలం పెద్ద జొన్నవరం, మీర్జాఖాన్ పల్లె ప్రాంతాల్లో వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా ఎండల వేడితో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజానీకం వర్షంతో వాతావరణ చల్లబడుతుందనే ఆశాభావంతో ఉన్నారు.గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పగలంతా భరించలేని ఉక్కబోతతో ఉడికించిన వాతావరణం రాత్రి 11 నుంచి మారిపోయింది. వేగంగా వీచిన గాలులతో చెట్లు పడిపోయాయి. విద్యుత్తు స్తంభాలు నేల కొరిగాయి. కరెంటు తీగలు తెగిపడ్డాయి. జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. కొన్నిచోట్ల ముందస్తు జాగ్రత్తగా అధికారులు సరఫరాను నిలిపేశారు. మరికొన్నిచోట్ల పిడుగులు పడ్డాయి. మంగళగిరి, వట్టిచెరుకూరు, తాడికొండ, మంగళగిరి, పెదనందిపాడు, తుళ్లూరు, మేడికొండూరు, దుగ్గిరాల, తెనాలి, ప్రత్తిపాడు, కొల్లిపర, కొల్లూరు, తదితర మండలాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి.

# మేడిన్ ఇండియా "బాహుబలి హైడ్రోజన్ రైలు" వచ్చేస్తోంది!

**స్పీడ్, విశేషాలు ఏమిటో తెలుసా**

**భారతీయ రైల్వే చరిత్రలో సరికొత్త మలుపు**

**హైడ్రోజన్ రైలు ప్రయాణానికి అంతా రెడీ!**




బొగ్గుతో నడిచే రైళ్ల స్థానంలో డిజిల్ ఇంజన్లు వచ్చాయి. ఆ తర్వాత విద్యుత్ ఆధారిత రైళ్లు ఇపుడు నడుస్తున్నాయి. ఇకపై హైడ్రోజన్ రైళ్లు పట్టాలపై పరుగులు తీయనున్నాయి. ఎలక్ట్రిక్ రైళ్లతో పోలిస్తే వీటి నిర్వహణ, ఇంధన ఖర్చు చాలా తక్కువ. పైగా వీటి వల్ల పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్తున్నారు. మన దేశ తొలి బాహుబలి ఇంజిన్ హైడ్రోజన్ రైలు అతి త్వరలో పరుగులు తీయడానికి సిద్ధమైంది. వీటి రాక రైల్వే గతిని మార్చేస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.మేడిన్ ఇండియా తొలి హైడ్రోజన్ రైలు కార్యకలాపాల ప్రారంభానికి రైల్వే ఆమోదం తెలిపింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఈ రైలు హర్యానాలోని జీంద్ నుంచి సోనీపథ్ మధ్య పరుగులు తీయనుంది. పది బోగీలు కలిగిన రైలు గరిష్ఠ వేగం గంటకు 110కిలో మీటర్లు. మన హైడ్రోజన్ రైలింజన్ సామర్థ్యం (ముందు, వెనుక రెండు 1,200ఖఔ డ్రైవింగ్ పవర్ కార్లు కలిపి) 2,400 కిలోవాట్లు. ఇది ఇతర దేశాల్లో నడుస్తున్న హైడ్రోజన్ రైళ్లతో పోలిస్తే బాహుబలి ఇంజిన్ అని చెప్పుకోవచ్చు. హైడ్రోజన్ ఫ్యూయెల్ సెల్ ప్రొపల్షన్ వ్యవస్థ సాయంతో పనిచేసే ఈ రైళ్లు ప్రస్తుతం జర్మనీ, ఫ్రాన్స్, జపాన్, చైనా, అమెరికాల్లో సేవలు అందిస్తున్నాయి. ఇవి పొగకు బదులుగా నీటి ఆవిరిని విడుదల చేస్తాయి.

**హైడ్రోజన్ రైలు విశేషాలు**

రైలు తయారీకి చేసిన ఖర్చు దాదాపు రూ.80 కోట్లు

జీంద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రోజన్ ప్లాంట్ కోసం రూ.120 కోట్లు

చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో బోగీల తయారీ

ఈ ట్రైన్ వేగం గంటకు 110 కిలోమీటర్లు

రైలు రెండు వైపులా అత్యంత శక్తివంతమైన 2400 kW డీపీసీలు (డ్రైవింగ్ పవర్ కార్స్).

ఇంటీరియర్ డిజైన్, ఆటోమేటిక్ డోర్లు, డిజిటల్ డిస్‌ప్లేలు.

బొగ్గు రైళ్ల కారణంగా వాతావరణ కాలుష్యంతో పాటు చాలా ఎక్కువగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

డీజిల్ ఇంజిన్ రైళ్ల కారణంగా కాలుష్యం పెరగడంతో పాటు నిర్వహణ వ్యయాలు అధికం.

ఎలక్ట్రిక్ రైళ్లతో నిర్వహణ ఖర్చులు తగ్గినప్పటికీ ట్రాక్‌ల విద్యుదీకరణ, తరచూ కేబుళ్లు తెగిపోతుండడం మరమ్మతు ఖర్చులు ఎక్కువగా ఉంటున్నాయి.

ఈ నేపథ్యంలో అధికంగా లభించే హైడ్రోజన్‌తో అతి తక్కువ ఖర్చుతో రైళ్లను నడిపించడం వల్ల ఆర్థిక భారం తగ్గిపోతుంది. పైగా పర్యావరణానికి ఎలాంటి హాని లేకుండా అతి తక్కువ శబ్దంతో ఈ రైలు ప్రయాణిస్తుంది.

ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు 2018లో జర్మనీలో ప్రయాణించింది.

ఈ రైలులో సీటింగ్ సామర్థ్యం 150 కాగా, గరిష్ఠ వేగం 140 కి.మీ.

ఇప్పటి వరకు చైనా, జపాన్, ఫ్రాన్స్, అమెరికాలో మాత్రమే హైడ్రోజన్ రైళ్లున్నాయి.

హైడ్రోజన్ రైళ్ల ట్రయల్ పూర్తి చేసిన దేశాలు : ఇండియాతో పాటు కెనడా, ఇటలీ, సౌదీ అరేబియా, ఆస్ట్రియా, నెదర్లాండ్స్, పోలాండ్, స్వీడన్.

# ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట మైత్రివనం వద్ద ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, నందమూరి కుటుంబ సభ్యులు, నటుడు మంచు మనోజ్, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రాజకీయ భిక్ష పెట్టిందే ఎన్టీఆర్ అన్నారు. అన్న ఎన్టీఆర్ లేకుంటే మీరు నాయకుడు అయ్యారా అని నిలదీశారు. అన్న నీడన బతికిన మీరు ఆయన గురించి తక్కువ చేసి మాట్లాడటమేమిటని ప్రశ్నించారు. రామారావు పేరు పెట్టుకున్న నకిలీలు కూడా కూడా ఈరోజు నాయకుడిగా చెలామణి అవుతున్నారని వ్యాఖ్యానించారు.ఎన్టీఆర్ అవకాశమిచ్చి, ప్రోత్సాహమిచ్చిన వారిలో తుమ్మల నాగేశ్వరరావు, మండవ వెంకటేశ్వరరావు, మాధవరెడ్డి, జానారెడ్డి, దేవేందర్ గౌడ్, కడియం శ్రీహరి, మోత్కుపల్లి నర్సింహులుతో పాటు కేసీఆర్ కూడా ఉన్నారని పేర్కొన్నారు. ఆయనకు రాజకీయ అవకాశం కల్పించిందే ఎన్టీఆర్ అన్నారు. ఈ చరిత్రను ఎవరూ మరువరాదని రేవంత్ రెడ్డి అన్నారు.



# హొర్ముజ్ జలసంధి పూర్తిగా మూసివేసిన ఇరాన్

## చిక్కుకుపోయిన భారత నౌకలు.. ఎల్పీజీ ధరల ఆందోళన

అమెరికా - ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతలు ప్రస్తుతం హొర్ముజ్ జలసంధిని కేంద్ర బిందువుగా మార్చాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో దాదాపు ఐదో వంతు వాటా కలిగిన ఈ కీలక జలమార్గంపై పట్టు సాధించేందుకు ఇరుపక్షాలు ప్రయత్నిస్తుండటంతో.. అంతర్జాతీయ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్ర అనిశ్చితిలో పడింది. ముఖ్యంగా తన ముడి చమురు, ఎల్పిజి, ఎల్ఎన్జి అవసరాల కోసం మధ్యప్రాచ్యంపై అధికంగా ఆధారపడే భారత ఆర్థిక వ్యవస్థపై ఈ పరిణామాలు నేరుగా ప్రభావం చూపుతున్నాయి. ఇరాన్ గతంలో భారత నౌకల పట్ల కొంత సానుకూలత ప్రదర్శించినప్పటికీ.. అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తుండటంతో ఇరాన్ మళ్ళీ ఈ మార్గాన్ని మూసివేసింది. దీనివల్ల భారతీయ నౌకలు ఘర్షణల మధ్య చిక్కుకుపోయే పరిస్థితి తలెత్తింది. ఈ క్రమంలోనే 'దేశ్ గరిమ' అనే భారతీయ ట్యాంకర్ సురక్షితంగా జలసంధిని దాటినప్పటికీ.. 'సన్మార్ హెరాల్డ్', 'జగ్ అర్నవ్' వంటి నౌకలపై ఇరాన్ విప్లవాత్మక గార్డ్స్ కాల్పులు జరపడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. ప్రాణనష్టం జరగకపోయినా, భారతీయ నౌకలను లక్ష్యంగా చేసుకోవడం పట్ల భారత్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ రాయబారిని పిలిపించి తన ఆందోళనను వ్యక్తం చేయడమే కాకుండా, వాణిజ్య నౌకల భద్రత విషయంలో రాజీ లేదని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. గతంలో అందించిన సహకారాన్ని గుర్తు చేస్తూ, త్వరితగతిన సురక్షిత రవాణాను పునరుద్ధరించాలని విక్రమ్ మిశ్రీ కోరారు. అయితే ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్, దాని పరిసర ప్రాంతాల్లో సుమారు 20కి పైగా భారతీయ నౌకలు అనుమతి కోసం ఎదురుచూస్తున్నాయి. ప్రభుత్వ




గణాంకాల ప్రకారం ఇంధన, రసాయన ఎరువుల అవసరాల కోసం సుమారు 33 నౌకలను తరలించాల్సిన అవసరం ఉంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి ఎల్పిజి సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో, ప్రభుత్వం గృహ అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వాణిజ్య సరఫరాలను 70 శాతానికి పరిమితం చేసింది. ముడి చమురు విషయంలో మాత్రం భారత్ వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. అమెరికా ఆంక్షల సడలింపును వినియోగించుకుంటూ రష్యా నుండి ముడి చమురు దిగుమతులను భారీగా పెంచింది. హొర్ముజ్ జలసంధిలో భారతీయ వాణిజ్య నౌకలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కాల్పులు జరపడంతో భారత్ తన నౌకాయాన భద్రతపై అత్యంత అప్రమత్తమైంది. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ ఈ జలసంధి దిగ్బంధనాన్ని పటిష్టం చేస్తూ, ఏ నౌకనూ అనుమతించని కఠిన వైఖరిని అవలంబిస్తోంది. గతంలో భారత్‌కు మినహాయింపులు ఉన్నప్పటికీ, ఏప్రిల్ 18న 'జగ్ అర్నవ్', 'సన్మార్ హెరాల్డ్' నౌకలపై జరిగిన దాడులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా, భారత ప్రభుత్వం మరియు నౌకాదళం కొత్త మార్గదర్శకాలను విడుదల చేశాయి. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు భారత నౌకలు హొర్ముజ్ జలసంధిని దాటే ప్రయత్నం చేయవద్దని, ముఖ్యంగా వ్యూహాత్మకమైన లారక్ దీవి పరిసరాలకు వెళ్లకూడదని స్పష్టం చేసింది. నౌకాదళం నుండి గ్రీన్ సిగ్నల్ వచ్చినప్పుడు మాత్రమే ప్రయాణించాలని సూచించింది. పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న భారత నౌకల భద్రతను పర్యవేక్షించడానికి నౌకాదళం తన చర్యలను ముమ్మరం చేసింది. ప్రపంచ చమురు సరఫరాకు కీలకమైన ఈ మార్గంలో ఇరాన్ తన సైనిక పట్టును పెంచడం వల్ల భారత ఇంధన దిగుమతులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రభుత్వం పరిస్థితిని నిశితంగా గమనిస్తూ నావికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. జూన్ 2023 నాటి రికార్డు స్థాయికి చేరువలో రష్యా చమురు ప్రవాహం ఉన్నప్పటికీ, ఎల్పిజి, ఎల్ఎన్జి సరఫరాలు మాత్రం ఇంకా క్లిష్టంగానే ఉన్నాయి. వెనిజులా, పశ్చిమ ఆఫ్రికా నుండి దిగుమతులు కొనసాగుతున్నా, హొర్ముజ్ జలసంధి దిగ్బంధనం కొనసాగితే రాబోయే రోజుల్లో ఇంధన సవాళ్లు మరింత పెరిగే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# పెట్రోల్ కొట్టించేటప్పుడు రూ. 110, రూ. 210 అని ఎందుకు అడుగుతారో తెలుసా



మనం పెట్రోల్ బంకుకు వెళ్ళినప్పుడు చాలా మంది వాహనదారులు రూ. 100 లేదా రూ. 500 అని కాకుండా.. రూ. 110, రూ. 210 లేదా రూ. 510 అని పెట్రోల్ కొట్టించడాన్ని గమనిస్తుంటాం. అసలు ఈ పద్ధతి వెనుక ఏమైనా శాస్త్రీయ కారణం ఉందా లేక ఇదొక అలవాటా సాధారణంగా ఇలాంటి వింతైన నంబర్లతో పెట్రోల్ కొట్టించడం వెనుక కొన్ని ఆసక్తికరమైన మానసిక కారణాలు , పాత నమ్మకాలు దాగి ఉన్నాయి. ప్రస్తుతం పెరుగుతున్న పెట్రోల్ ధరలు దృష్ట్యా, ప్రతి రూపాయి విలువైనదే కాబట్టి జనం ఇలాంటి వ్యూహాలు అనుసరిస్తుంటారు. **1. మానసిక సంతృప్తి , సులభమైన లెక్క**మనుషులకు సహజంగానే కొన్ని అంకెలు అంటే ఇష్టం ఉంటుంది. రూ. 100 అనేది ఒక రౌండ్ ఫిగర్ అయినప్పటికీ, దానికంటే రూ. 110 లేదా రూ. 210 అనేది ఒక విధమైన మానసిక సమతుల్యతను ఇస్తుందని చాలా మంది భావిస్తారు. ఇది తమ బడ్జెట్‌కు లోబడి ఉన్నట్లుగా, ఖచ్చితమైన ఫిగర్‌గా వాళ్లకు అనిపిస్తుంది. సరళంగా చెప్పాలంటే, ఇలాంటి ఆడ్ నంబర్లు మెదడుకు ఎక్కువ స్పష్టతను ఇస్తాయి. **2. ట్యాంక్ ఫుల్ లేదా హాఫ్ ఫుల్ లెక్కలు**కొంతమంది తమ వాహనంలోని ట్యాంక్ సగం వరకు రావాలన్నా లేదా పూర్తిగా నిండాలన్నా ఇలాంటి చిల్లర అంకెలతో పెట్రోల్ పోయిస్తుంటారు. ఉదాహరణకు, రూ. 100 పోయిస్తే ట్యాంక్ సూది ఒక స్థాయికి వస్తే, మరో రూ. 10 కలిపి రూ. 110 కి పోయించడం వల్ల అది ఖచ్చితంగా సగం మార్కును చేరుకుంటుందనే నమ్మకం వాహనదారులలో ఉంటుంది. ఇది వారిని పదే పదే బంకుకు వెళ్లే అవసరం లేకుండా చేస్తుంది. **3. మోసాలకు చెక్ పెట్టే ప్రయత్నం**ఒకప్పుడు పెట్రోల్ బంకుల్లో రీడింగ్‌ను మానిప్యులేట్ (తారుమారు) చేస్తారనే ప్రచారం జోరుగా సాగేది. మిషన్లలో రూ. 100, రూ. 500 లేదా రూ. 1000 వంటి రౌండ్ ఫిగర్లకు ముందే చిప్స్ సెట్ చేసి తక్కువ పెట్రోల్ వచ్చేలా చేస్తారని ప్రజలు భయపడేవారు. అందుకే మిషన్ సాఫ్ట్‌వేర్‌ను కన్ఫ్యూజ్ చేయడానికి రూ. 110 లేదా రూ. 210 వంటి అంకెలను ఎంచుకోవడం మొదలుపెట్టారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ మిషన్లు చాలా ఖచ్చితంగా పనిచేస్తున్నప్పటికీ, పాత అలవాటు ప్రకారం జనం ఇప్పటికీ ఆడ్ నంబర్లనే అడుగుతుంటారు. ఇలా అడగడం వల్ల బంక్ సిబ్బంది కూడా అలర్ట్ అవుతారని కస్టమర్ల నమ్మకం. పెరుగుతున్న పెట్రోల్ ధరలు సామాన్యుడి జేబుకు చిల్లు పెడుతున్న ఈ రోజుల్లో, ఇలాంటి చిన్న చిన్న చిట్కాలు పాటిస్తూ వాహనదారులు ఒక రకమైన భద్రతా భావాన్ని పొందుతున్నారు. ఆధునిక కాలంలో పెట్రోల్ పంపులు చాలా పారదర్శకంగా ఉన్నప్పటికీ, కస్టమర్ మనస్తత్వం మాత్రం పాత పద్ధతులకే మొగ్గు చూపుతోంది. మీరు ఒకవేళ రౌండ్ ఫిగర్లతో పెట్రోల్ కొట్టిస్తుంటే, ఒకసారి ఇలాంటి ఆడ్ నంబర్లను ప్రయత్నించి చూడండి. ఇందులో పెద్దగా లాభనష్టాలు లేకపోయినా, మీ మనసుకు మాత్రం మనం తక్కువ పెట్రోల్ పోయించుకోలేదు అనే ఒక చిన్న తృప్తి కలుగుతుంది. చివరగా, పెట్రోల్ నాణ్యత , పరిమాణం విషయంలో అనుమానం ఉంటే బంకుల్లో లభించే టెస్టింగ్ కిట్లను అడిగి తెలుసుకోవడం ఉత్తమం. కేవలం నంబర్లను మార్చడం వల్ల వచ్చే పెట్రోల్ పరిమాణంలో పెద్ద తేడా ఉండకపోవచ్చు కానీ, అది మీకు ఒక రకమైన మానసిక ప్రశాంతతను ఇస్తుంది. పెట్రోల్ బంకులకు వెళ్ళినప్పుడు జీరో రీడింగ్‌ను గమనించడం, బిల్లును సరిచూసుకోవడం వంటి ప్రాథమిక జాగ్రత్తలు పాటించడం ఎప్పుడూ మంచిది.

# చర్చలకు గుడ్ బై చెప్పిన ఇరాన్

## అమెరికాతో తాడోపేడో తేల్చుకుంటామని కీలక ప్రకటన కారణం ఏంటంటే..

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి పరాకాష్టకు చేరుకున్నాయి. అమెరికా- ఇరాన్ దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరుగుతాయని ఒకవైపు ఆశలు చిగురిస్తున్న తరుణంలోనే, హొర్ముజ్ జలసంధిలో జరిగిన ఒక అనూహ్య ఘటన పరిస్థితిని ఒక్కసారిగా మార్చివేసింది. ఇరాన్ జెండాతో ప్రయాణిస్తున్న ఒక సరుకు రవాణా నౌకను అమెరికా దళాలు స్వాధీనం చేసుకోవడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటన జరిగిన కొద్ది గంటల ముందే, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రతినిధి బృందాన్ని చర్చల నిమిత్తం పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌కు పంపుతున్నట్లు ప్రకటించారు. అయితే, నౌక స్వాధీనం తర్వాత ఇరాన్ తన వైఖరిని కఠినతరం చేసింది. తాజా పరిస్థితుల నేపథ్యంలో అమెరికాతో కొత్త విడత చర్చలు జరిపే ప్రణాళికలేవీ తమ ప్రభుత్వానికి లేవని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలు జరుగుతున్నాయనే వార్తలను ప్రభుత్వ అధికారిక మీడియా సంస్థ ఐఆర్ఎన్ఎ పూర్తిగా కొట్టిపారేసింది. అటువంటి చర్చలు ఏవీ షెడ్యూల్ చేయబడలేదని, ఇది కేవలం ఒక బూటకమని స్పష్టం చేసింది. అమెరికా విధిస్తున్న దిగ్బంధనం మరియు దాడులు కొనసాగుతున్నంత కాలం చర్చల ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చిచెప్పింది. ఈ ఉద్రిక్తతల వల్ల ఇప్పటివరకు జరిగిన ప్రాణనష్టంపై ఇరాన్ భీతి




గొలిపే గణాంకాలను విడుదల చేసింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి కనీసం 3,375 మంది మరణించారని, అందులో 383 మంది చిన్నారులు కూడా ఉన్నారని ఇరాన్ లీగల్ మెడిసిన్ ఆర్గనైజేషన్ వెల్లడించింది. కేవలం ఇరాన్‌లోనే కాకుండా లెబనాన్‌లో 2,290 మందికి పైగా, ఇజ్రాయెల్‌లో 23 మంది, ఇతర గల్ఫ్ దేశాలలో డజనుకు పైగా మరణించారు. ఈ ఘర్షణల్లో 15 మంది ఇజ్రాయెల్ సైనికులు మరియు 13 మంది అమెరికన్ సైనికులు కూడా ప్రాణాలు కోల్పోవడం పరిస్థితి తీవ్రతను సూచిస్తోంది. వ్యూహాత్మకమైన హొర్ముజ్ జలసంధి ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెను ముప్పుగా మారింది. ప్రపంచ చమురు వాణిజ్యంలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలమార్గంపై ఇరాన్ రాకపోకలను పరిమితం చేసింది. దీనికి ప్రతిచర్యగా అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని విధించింది. ఈ జలమార్గం కేవలం చమురుకే కాకుండా సహజ వాయువు, ఎరువులు, ఆఫ్ఘనిస్తాన్ వంటి దేశాలకు అవసరమైన నిత్యావసర వస్తువుల సరఫరాకు అత్యంత కీలకమైనది. ఈ దిగ్బంధనం వల్ల ప్రపంచ దేశాల సరఫరా గొలుసు దెబ్బతినడమే కాకుండా ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. మరోవైపు, లెబనాన్‌లో ఇజ్రాయెల్‌తో పది రోజుల పాటు కొనసాగుతున్న తాత్కాలిక కాల్పుల విరమణ నేపథ్యంలో కొంత ఊరట కనిపిస్తోంది. యుద్ధంలో సర్వం కోల్పోయిన వేలాది మంది ప్రజలు తమ స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు. కానీ, ఇస్లామాబాద్‌లో జరగాల్సిన చర్చల విషయంలో నెలకొన్న అనిశ్చితి వల్ల ఈ శాంతి ఎంతకాలం ఉంటుందోనన్న ఆందోళన నెలకొంది. పాకిస్థాన్ ప్రభుత్వం ఈ చర్చల కోసం దాదాపు 20,000 మంది భద్రతా సిబ్బందిని మోహరించి నగరాన్ని కోటలా మార్చినప్పటికీ, ఇరాన్ నిరాకరణతో ఆ ప్రయత్నాలు అగమ్యగోచరంగా మారాయి. అమెరికా తన "గరిష్ట ఒత్తిడి" వ్యూహాన్ని కొనసాగిస్తుంటే, ఇరాన్ తన సార్వభౌమాధికారం మరియు ఆత్మరక్షణ హక్కును వినియోగించుకుంటామని హెచ్చరిస్తోంది. ఈ రెండు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన పశ్చిమాసియాను ఒక భారీ యుద్ధం వైపు నెట్టే ప్రమాదం కనిపిస్తోంది. ప్రస్తుతానికి దౌత్య మార్గాలు మూసుకుపోవడంతో, అంతర్జాతీయ సమాజం ఈ సంక్షోభం ఎటు దారితీస్తుందోనని ఆందోళనతో గమనిస్తోంది.

# ది హొస్టెల్లర్ సంచలనం: 150 కోట్ల భారీ పెట్టుబడితో కొత్త రికార్డు




ప్రముఖ బ్యాక్‌ప్యాకర్ హాస్టల్ చైన్ 'ది హొస్టెల్లర్' తాజాగా సీరీస్ బి ఫండింగ్‌లో ఏకంగా 150 కోట్లు సమీకరించింది. భారతదేశంలోని ఏ బ్యాక్‌ప్యాకర్ చైన్‌కైనా దక్కిన అతిపెద్ద ఇన్‌స్టిట్యూషనల్ ఫండింగ్ ఇదే కావడం విశేషం. 11 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణం తర్వాత, బడ్జెట్ ట్రావెల్ రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు ఈ స్టార్టప్ సిద్ధమైంది. దేశవ్యాప్తంగా వేసవి సెలవుల రద్దీ మొదలవుతున్న తరుణంలో ఈ నిధులు అందడం సంస్థకు పెద్ద ప్లస్ పాయింట్. సిక్స్‌సెన్స్ వెంచర్స్‌తో పాటు ఇతర ప్రముఖ ఇన్వెస్టర్లు ఈ ఫండింగ్ రౌండ్‌లో పాల్గొన్నారు. భారతదేశంలో చిన్న తరహా హాస్పిటాలిటీ వెంచర్ల పట్ల ఇన్వెస్టర్ల దృక్పథం మారుతోందని ఈ పెట్టుబడి నిరూపిస్తోంది. కేవలం ఒక్క హాస్టల్‌తో మొదలైన ఈ ప్రయాణం, నేడు దేశవ్యాప్త బ్రాండ్‌గా ఎదిగింది. సొంతంగా ఎదిగిన స్టార్టప్‌లు కూడా మార్కెట్‌లో గణనీయమైన స్థాయికి చేరుకోగలవని ఈ విజయం చాటిచెబుతోంది. యువ పర్యాటకుల కోసం భారీగా విస్తరిస్తున్న 'ది హొస్టెల్లర్'ప్రస్తుతం ఈ బ్రాండ్‌కు దేశవ్యాప్తంగా 60కి పైగా ప్రాపర్టీలు ఉండగా, అందులో 3,500 బెడ్స్ అందుబాటులో ఉన్నాయి. త్వరలోనే వీటిని 150 ప్రాపర్టీలకు పెంచాలని సంస్థ ప్లాన్ చేస్తోంది. పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా బెడ్ల సామర్థ్యాన్ని 10,000కు చేర్చడమే లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా జెన్-జీ పర్యాటకులను ఆకర్షించే పాపులర్ డెస్టినేషన్లపై ఈ సంస్థ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. విస్తరణ విభాగంప్రస్తుత పరిస్థితి2026 లక్ష్యాలు మొత్తం బెడ్ల సామర్థ్యం3,500బెడ్స్10,000 బెడ్స్ప్రాపర్టీల సంఖ్య60 హాస్టళ్లు150 హాస్టళ్లువిస్తరణతో పాటు లాభదాయకతను కొనసాగించడంపై కంపెనీ ఫోకస్ పెట్టింది. ఈ నిధులను భారీగా కొత్త నియామకాలకు, బుకింగ్ టెక్నాలజీని మెరుగుపరచడానికి ఉపయోగించనున్నారు. సమ్మర్ రష్ దగ్గరపడుతుండటంతో, పర్యాటకులు నమ్మకమైన, తక్కువ ధరలో దొరికే బస కోసం చూస్తున్నారు. బడ్జెట్ ఫ్రెండ్లీ పర్యాటకులకు బెస్ట్ ఛాయిస్‌గా నిలవాలని 'ది హొస్టెల్లర్' పావులు కదుపుతోంది. **బడ్జెట్ ట్రావెల్ మార్కెట్‌లో దూసుకుపోతున్న స్టార్టప్**భారతదేశంలో యువత ట్రావెల్ కల్చర్ మారుతోంది. కేవలం ప్రయాణమే కాకుండా, కొత్త అనుభవాలను పంచుకోవడానికి వారు ఇష్టపడుతున్నారు. ఈ పెట్టుబడి ఆర్గనైజ్డ్ హాస్టల్ రంగం భవిష్యత్తుపై ఉన్న నమ్మకాన్ని మరింత పెంచుతోంది. మార్కెట్ లీడర్‌గా ఎదిగిన 'ది హొస్టెల్లర్' ప్రయాణం ఎంతోమంది స్థానిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిస్తోంది. హాలిడే సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాది మంది అతిథులకు స్వాగతం పలికేందుకు ఈ సంస్థ సర్వం సిద్ధం చేసుకుంది.

# లక్ కాదు బ్రదర్.. కష్టం!

## 20 సార్లు ఫెయిల్ అయి గూగుల్‌లో జాబ్ కొట్టిన యువకుడు!




సాఫ్ట్‌వేర్ రంగంలో గూగుల్ లాంటి కంపెనీలో ఉద్యోగం సంపాదించడం అంటే అది ఒక అదృష్టమని చాలామంది భావిస్తారు. కానీ, ఆ అదృష్టం వెనుక ఎన్ని కన్నీళ్లు, ఎన్ని నిద్రలేని రాత్రులు, ఎన్ని అవమానాలు ఉంటాయో ఎవరూ గమనించరు. సరిగ్గా ఇదే విషయాన్ని నిరూపిస్తూ బెంగళూరుకు చెందిన ఒక టెక్ ప్రొఫెషనల్ తన సక్సెస్ జర్నీని సోషల్ మీడియాలో పంచుకోగా, అది ఇప్పుడు వైరల్ అవుతోంది. కేవలం ఒకటీ రెండు కాదు, ఏకంగా 20కి పైగా ప్రముఖ కంపెనీల నుంచి రిజెక్షన్ లెటర్లు అందుకున్నా కృంగిపోకుండా గూగుల్‌లో జాబ్ కొట్టి అందరినీ ఆశ్చర్యపరిచాడు నమన్ కుమార్ గౌతమ్. నమన్ తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో తాను ఎదుర్కొన్న చేదు అనుభవాలను బయటపెట్టాడు. మైక్రోసాఫ్ట్ వీసా అడోబ్ , మీషో బుకింగ్.కామ్ వంటి దిగ్గజ సంస్థల నుంచి అతనికి నిరాశే ఎదురైంది. కొన్ని కంపెనీలు అతను "పొజిషన్ రిక్వైర్మెంట్స్‌కు సరిపోవడం లేదని" చెబితే, మరికొన్ని "యూరోపియన్ యూనియన్ నివాసితులకు మాత్రమే ఈ ఉద్యోగం" అని మొహం మీదే చెప్పేశాయి. ఇంకొన్ని కంపెనీలైతే ఆ వేకెన్సీలు అప్పటికే భర్తీ అయిపోయాయని సమాధానం ఇచ్చాయి. ఇలా ఒకదాని తర్వాత ఒకటి వరుసగా 20 కంపెనీలు తిరస్కరించడంతో ఒక దశలో అతను తీవ్ర నిరాశకు గురయ్యాడు. **లక్ వెనుక దాగున్న 'హజిల్'**నమన్ తన వీడియోలో తాను ఏడుస్తున్న ఒక చిన్న క్లిప్‌ను కూడా జోడించాడు. "గూగుల్‌లో పనిచేస్తున్నావా.. నువ్వు చాలా లక్కీ బ్రో!" అని అనేవారికి సమాధానంగా, "మీరు చూడని కష్టాన్నే అదృష్టం అని పిలుస్తారు" అని అతను చాలా గట్టిగా చెప్పాడు. టైర్-3 కాలేజీలో చదివిన తనకు గూగుల్ లాంటి చోట ఉద్యోగం రావడం వెనుక అంతులేని శ్రమ ఉందని తెలిపాడు. చివరకు ఆగస్టు 2025లో గూగుల్ నుంచి అంగీకార పత్రం అందడంతో అతని సుదీర్ఘ పోరాటం ఫలించింది. రిజెక్షన్ అనేది ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అని, అది గమ్యం కాదని అతను యువతకు సందేశమిచ్చాడు. **బెంగళూరు ఐటీ వర్గాల్లో హాట్ టాపిక్**ఈ పోస్ట్ చూసిన నెటిజన్లు నమన్‌పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. "నీ రిజల్ట్ మాత్రమే అందరికీ కనిపిస్తుంది, కానీ ఆ నిద్రలేని రాత్రులు, ఒత్తిడి మాకు తెలుసు.. నీవు దీనికి అర్హుడివి" అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ముఖ్యంగా బెంగళూరు లాంటి ఐటీ హబ్‌లో పోటీ విపరీతంగా ఉన్నప్పుడు, ఇలాంటి ఇన్స్పిరేషన్ స్టోరీలు నిరుద్యోగుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి. కేవలం డిగ్రీ లేదా కాలేజీ పేరు చూసి అవకాశాలు రాకపోయినా, పట్టుదలతో నైపుణ్యాన్ని పెంచుకుంటే ప్రపంచంలోనే టాప్ కంపెనీల్లో స్థానం సంపాదించవచ్చని నమన్ నిరూపించాడు. నమన్ కథ మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. కెరీర్ ఎదుగుదలలో ఫెయిల్యూర్స్ అనేవి సహజం. ప్రతి రిజెక్షన్ లెటర్ మనలో ఉన్న లోపాలను సరిదిద్దుకోవడానికి ఒక అవకాశం ఇస్తుంది. గూగుల్ వంటి సంస్థలు కేవలం అభ్యర్థి ప్రతిభను మాత్రమే కాదు, వారి పోరాట పటిమను కూడా గుర్తిస్తాయి. బెంగళూరులో ఐటీ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న వేల మంది యువతకు నమన్ ఇప్పుడు ఒక రోల్ మోడల్‌గా నిలిచాడు. రిజెక్షన్లను చూసి వెనకడుగు వేయకుండా, ఆ అనుభవాలనే మెట్లుగా మార్చుకుని శిఖరాన్ని చేరుకోవచ్చని ఈ యువ టెక్కీ ఉదంతం మనకు చెబుతోంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం అకడమిక్ నాలెడ్జ్ మాత్రమే సరిపోదు. మార్కెట్ డిమాండ్‌కు తగ్గట్టుగా నిరంతరం అప్‌డేట్ అవుతూ ఉండాలి. నమన్ తన ఇంటర్వ్యూల సమయంలో తలెత్తిన లోపాలను గుర్తించి, వాటిపై కసరత్తు చేయడం వల్లే అసాధ్యాన్ని సుసాధ్యం చేయగలిగాడు. ఒక్కోసారి మనకు అత్యంత కావాలనుకున్నది దక్కకపోయినా, అంతకంటే మెరుగైనది మనకోసం ఎదురుచూస్తూ ఉండవచ్చు. కాబట్టి, ప్రయత్నాన్ని ఎప్పుడూ ఆపకూడదని, నిలకడగా ఉండటమే విజయానికి అసలైన రహస్యమని ఈ కథనం స్పష్టం చేస్తోంది.

# రాగి ధరలు భారీగా పెరగబోతున్నాయి



కొనుగోలుపై కీలక సూచన చేస్తున్న ప్రముఖ ఆర్థిక సంస్థలు ప్రస్తుత 2026 ఏప్రిల్ నెలలో అంతర్జాతీయ లోహాల మార్కెట్‌లో రాగి ధరలు అత్యంత ఆసక్తికరమైన మలుపులు తిరుగుతున్నాయి. ముఖ్యంగా ఏప్రిల్ 20, సోమవారం నాటి ట్రేడింగ్‌ను గమనిస్తే, రాగి ధరలు కొంత మేర తగ్గుముఖం పట్టడం ఇన్వెస్టర్లను ఆలోచనలో పడేసింది. గత ఏడాది కాలంగా రాగి ధరలు విపరీతంగా పెరుగుతాయని మార్కెట్ పండితులు అంచనా వేసినప్పటికీ, ప్రస్తుతం నెలకొన్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా పశ్చిమాసియాలో అమెరికా - ఇరాన్ మధ్య నెలకొన్న ప్రతిష్టంభన ఈ అంచనాలను తలకిందులు చేస్తోంది. అంతర్జాతీయ మార్కెట్ అయిన కామెక్స్‌లో రాగి ధర పౌండ్‌కు 6.0535 డాలర్ల వద్దకు చేరగా.. మన దేశీయ ఎంసిఎక్స్ మార్కెట్‌లో కిలోగ్రాముకు 1268.75 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. రాగి ధరల చరిత్రను ఒకసారి పరిశీలిస్తే.. 2026 జనవరి నెలలో ఇవి సరికొత్త శిఖరాలను తాకాయి. జనవరి 29న లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌లో టన్ను రాగి ధర దాదాపు 14,527 డాలర్లకు చేరుకోవడం ఒక రికార్డు. ఆ సమయంలో చిలీ, ఇండోనేషియా వంటి ప్రధాన ఉత్పత్తి దేశాల్లోని గనుల్లో కార్మిక సమస్యలు లేదా సాంకేతిక అంతరాయాల వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. మరోవైపు, ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్లు, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ ఒక్కసారిగా పెరగడంతో రాగికి డిమాండ్ ఊహించని రీతిలో పెరిగింది. అయితే ఫిబ్రవరి నెలాఖరు నుండి పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో, ఇన్వెస్టర్లు రాగి వంటి పారిశ్రామిక లోహాల కంటే బంగారం, వెండి వంటి సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపారు, ఇది రాగి ధరలపై ఒత్తిడిని పెంచింది. రాగి భవిష్యత్తుపై ప్రపంచ ప్రఖ్యాత ఆర్థిక సంస్థలు భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. గోల్డ్‌మన్ సాక్స్ వంటి సంస్థలు తమ ధరల అంచనాలను తగ్గించాయి. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగించడం వల్ల రాగి వినియోగం తగ్గుతుందని, అలాగే ఈ ఏడాది సరఫరా కూడా ఆశాజనకంగానే ఉంటుందని వారు భావిస్తున్నారు. దీనికి విరుద్ధంగా, జేపీ మోర్గాన్, సిటీ గ్రూప్ వంటి సంస్థలు మాత్రం రాగి కొరత రాబోయే రోజుల్లో తీవ్రమవుతుందని హెచ్చరిస్తున్నాయి.రాగి ధరలు భారీగా పెరగబోతున్నాయి.. ప్రపంచానికి షాకిచ్చిన కాపర్ దిగ్గజం కోచిల్కో.. పర్యావరణ హితమైన ఇంధన వనరుల వైపు ప్రపంచం మళ్లుతున్న తరుణంలో, సోలార్ ప్యానెల్స్, విండ్ టర్బైన్లు, పవర్ గ్రిడ్ల ఆధునీకరణకు జశీజూజూవతీ అత్యవసరమని, ఈ డిమాండ్‌ను తట్టుకునే స్థాయిలో ఉత్పత్తి పెరగడం లేదని వారు వాదిస్తున్నారు. ప్రస్తుతం అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు రాగి ధరలను పరోక్షంగా ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్ రాగి ఉత్పత్తిలో పెద్ద దేశం కాకపోయినప్పటికీ, హొర్ముజ్ జలసంధి వంటి కీలక మార్గాల్లో అశాంతి నెలకొంటే అది అంతర్జాతీయ వాణిజ్య రవాణా ఖర్చులను పెంచుతుంది. ఇది చివరికి రాగి ధరలపై ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం ధరలు కొంత తగ్గినట్లు కనిపిస్తున్నా, దీర్ఘకాలికంగా చూస్తే రాగికి ఉన్న పారిశ్రామిక ప్రాధాన్యత దృష్ట్యా ధరలు మళ్లీ పుంజుకునే అవకాశం పుష్కలంగా ఉంది. పారిశ్రామిక రంగంలో రాగిని "డాక్టర్ కాపర్" అని పిలుస్తారు, ఎందుకంటే దీని ధరల గమనాన్ని బట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆరోగ్యాన్ని అంచనా వేయవచ్చు. ప్రస్తుత తగ్గుదల తాత్కాలికమేనని, భౌగోళిక ఉద్రిక్తతలు సర్దుమణిగితే రాగి మళ్లీ రికార్డు స్థాయికి చేరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. డిస్క్లైమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు. మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

# జూన్‌లో టాలీవుడ్ జాతర..

## ‘పెద్ది’ నుంచి ‘స్వయంభూ’ వరకు భారీ రిలీజ్‌లు రెడీ!

2026 జూన్ నెల టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ వినోదాన్ని అందించేందుకు సిద్ధమవుతోంది. విభిన్న జోనర్లలో తెరకెక్కిన సినిమాలు వరుసగా థియేటర్లలోకి రానుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా స్టార్ హీరోల చిత్రాలు, హారర్ కామెడీలు, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు, స్పోర్ట్స్ డ్రామాలు ఇలా అన్ని రకాల సినిమాలు ఈ నెలలో ప్రేక్షకులను అలరించబోతున్నాయి. జూన్ మొదటి వారంలోనే టాలీవుడ్ బాక్సాఫీస్‌కు భారీ ఊపు రానుంది. జూన్ 3న ‘అసురాసుర’ సినిమా విడుదల కానుంది. యాక్షన్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో తెరకెక్కిన ఈ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి కనిపిస్తోంది. ఇక జూన్ 4న మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ పాన్ ఇండియా చిత్రం ‘పెద్ది’ థియేటర్లలోకి రానుంది. ఇప్పటికే ఈ సినిమాపై అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ట్రైలర్, టీజర్లు సోషల్ మీడియాలో భారీ హైప్ క్రియేట్ చేశాయి. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో యాక్షన్, ఎమోషన్, స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ ప్రధాన ఆకర్షణలుగా ఉండనున్నాయి. అదే వారంలో జూన్ 5న ‘రావ్ బహదూర్’ విడుదల కానుంది. అలాగే హాలీవుడ్ ఫాంటసీ యాక్షన్ చిత్రం ‘మాస్టర్స్ ఆఫ్ ది యూనివర్స్’ కూడా అదే రోజున ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో మొదటి వారంలోనే బాక్సాఫీస్ వద్ద మంచి పోటీ కనిపించనుంది. జూన్ రెండో వారం మాత్రం కాస్త నెమ్మదిగా ఉండనుంది. జూన్ 11న ‘సంగీతం’ అనే సినిమా మాత్రమే విడుదల కానుంది. సంగీతం ప్రధానంగా తెరకెక్కిన ఈ చిత్రంపై సంగీత ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. అయితే అసలు పోటీ మాత్రం జూన్ మూడో వారంలో కనిపించనుంది. జూన్ 19న ఒకేసారి నాలుగు సినిమాలు థియేటర్లలోకి రాబోతున్నాయి. ‘బాలన్ ది బాయ్’, ‘ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు’, హారర్ కామెడీ మూవీ ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’, అలాగే ఫ్యామిలీ ఎమోషన్స్‌తో తెరకెక్కిన ‘మా ఇంటి బంగారం’ సినిమాలు ఒకేరోజు విడుదల కానున్నాయి. ఈ నాలుగు చిత్రాలు పూర్తిగా భిన్నమైన జోనర్లలో ఉండటంతో ప్రేక్షకులకు మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ లభించే అవకాశం ఉంది. ముఖ్యంగా హారర్ కామెడీ సినిమాలకు ఇటీవల మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో ‘చెట్టు మీద దెయ్యం నాకేం భయం’పై ప్రత్యేక ఆసక్తి కనిపిస్తోంది. జూన్ చివరి వారం మాత్రం బాక్సాఫీస్ వద్ద భారీ హంగామా ఉండనుంది. జూన్ 26న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘స్వయంభూ’ విడుదల కానుంది. ఈ సినిమాపై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి బజ్ నెలకొంది. అదే రోజున స్పోర్ట్స్ డ్రామా ‘సూపర్ గోల్’ కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక రాజకీయ నేపథ్యంతో తెరకెక్కిన ఇంటెన్స్ డ్రామా ‘లెనిన్’ కూడా జూన్ 26నే విడుదల కానుండటం విశేషం. దీంతో నెలాఖరులో మూడు ప్రధాన చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ బరిలోకి దిగనున్నాయి. మొత్తం మీద చూస్తే 2026 జూన్ నెల టాలీవుడ్ ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వబోతోందనే చెప్పాలి. భారీ పాన్ ఇండియా సినిమాల నుంచి చిన్న కాన్సెప్ట్ మూవీస్ వరకు అన్ని రకాల చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇక వీటిలో ఏ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తుందో చూడాలి.





## వాట్ ఏ ప్లాన్ గురూ.. మహేశ్ బాబు వారణాసి వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్ ఆన్ ది వే.. !


మహేశ్ బాబు కాంపౌండ్ నుంచి రాబోతున్న మోస్ట్ అవెయిటెడ్ ప్రాజెక్ట్ వారణాసి స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంకా చోప్రా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమార్ కీ రోల్‌లో నటిస్తున్నాడు. మాధవన్, ప్రకాశ్ రాజ్ కీలకపాత్రల్లో నటిస్తున్నారు. మైథాలజీ, సైన్స్ ఫిక్షన్ జోనర్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తోన్న ఈ మూవీకి సంబంధించి ఏదో ఒక వార్త నెట్టింట వైరల్ అవుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. షూటింగ్ దశలో ఉన్న వారణాసి కొత్త షెడ్యూల్ వార్త ఒకటి నెట్టింట హైప్ క్రియేట్ చేస్తోంది. జక్కన్న టీం నెక్ట్స్ సినిమాలో వచ్చే ఓ భారీ వైల్డ్ యాక్షన్ ఎపిసోడ్‌ను ప్లాన్ చేస్తుందట. ఒళ్లు గగుర్పొడిచే స్టంట్స్, భారీ సెట్స్, ఇంటెన్స్ యాక్షన్ కొరియోగ్రఫీ లాంటి కీ ఎలిమెంట్స్ తో ఈ షెడ్యూల్ కొనసాగనుందట. తాజా టాక్ ప్రకారం నాన్ స్టాప్ నెల పాటు రాజమౌళి టీం ప్లాన్ చేసినట్టు ఇన్‌సైడ్ టాక్. సినిమాలో ఇదే బిగ్గెస్ట్ యాక్షన్ సీక్వెన్స్ అని.. భారతీయ సినిమా చరిత్రలో ఇప్పటిదాకా ఎవరూ ప్రయత్నించని విధంగా ఈ సీక్వెన్స్ ఉండబోతుందన్న వార్త ఇప్పుడు మూవీ లవర్స్‌తోపాటు మహేశ్ బాబు అభిమానులను ఫుల్ ఖుషీ చేస్తోంది. ఇదే నిజమైతే జక్కన్న మరోసారి తన రికార్డులను తానే బీట్ చేయడం పక్కా అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ చిత్రాన్ని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం రెండు పార్టులుగా రాబోతుంది. ఈ మూవీ ఫస్ట్ పార్ట్‌ను 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయన్నట్టు ఇప్పటికే ప్రకటించింది టీం. సెకండ్ పార్ట్ 2029లో వస్తుందని వార్తలు రాగా.. రాజమౌళి టీం రాబోయే రోజుల్లో ఏదైనా క్లారిటీ ఇస్తుందేమో చూడాలి.




## సూర్య ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ ఖరారు!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలీవుడ్ డైరెక్టర్ వెంకీ అట్లూరి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ ‘విశ్వనాథ్ అండ్ సన్స్’ విడుదల తేదీ తాజాగా ఖరారైంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. స్వాతంత్ర్య దినోత్సవ లాంగ్ వీకెండ్‌ను టార్గెట్ చేస్తూ ఈ డేట్‌ను లాక్ చేసినట్లు తెలుస్తుంది. ‘సార్’, ‘లక్కీ భాస్కర్’ వంటి వరుస హిట్లతో జోరుమీదున్న వెంకీ అట్లూరి, ఈసారి సూర్యతో కలిసి ఒక విలక్షణమైన ఫ్యామిలీ ఎమోషనల్ డ్రామాను ప్రేక్షకు ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాలో సూర్య 40 ఏళ్ల అంతర్జాతీయ పిస్టల్ షూటర్ ‘సంజయ్ విశ్వనాథ్’ పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతుండగా.. సూర్య సరసన యంగ్ బ్యూటీ మమితా బైజు కథానాయికగా నటిస్తుంది. సీనియర్ నటీమణులు రాధికా శరత్‌కుమార్, రవీనా టాండన్, మరియు భవాని శ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, నిమిష్ రవి సినిమాటోగ్రఫీని, నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

## భారతీయ ఇండీ సినిమాకు కేరాఫ్ అడ్రస్‌గా రానా



తెలుగు హీరో రానా దగ్గుబాటికి చెందిన ‘స్పిరిట్ మీడియా’ మన దేశంలో ఇండీ సినిమాలకు సరికొత్త ప్లాట్‌ఫామ్‌గా మారుతూ కొత్త ట్రెండ్ సెట్ చేస్తుంది. ఇండియాలోని అన్ని భాషలకు చెందిన చిన్న చిత్రాలను, క్రియేటివ్ కథలను సపోర్ట్ చేస్తూ వాటిని థియేటర్ల వరకు తీసుకురావడానికి స్పిరిట్ మీడియా గట్టిగా ప్రయత్నిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఫిల్మ్ ఫెస్టివల్స్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న సినిమాలను, మన నేటివిటీకి దగ్గరగా ఉండే నిజాయితీ గల కథలను ప్రేక్షకుల వద్దకు తీసుకెళ్లడమే స్పిరిట్ మీడియా మెయిన్ టార్గెట్. దీనివల్ల పెద్దగా గుర్తింపు లేని ఎంతోమంది ప్రతిభావంతులైన దర్శకులు, రచయితలకు తమ కథలను దేశవ్యాప్తంగా చూపించే ఒక అద్భుతమైన ఛాన్స్ దొరుకుతోంది. ఈ ఇండీ ఫిలిం మూవ్‌మెంట్‌లో ప్రస్తుతం నార్త్ ఈస్ట్ సినిమాలు చాలా స్పెషల్‌గా నిలుస్తూ వేగంగా ఎదుగుతున్నాయి. సిక్కిం, అసోం, మణిపూర్ లాంటి ప్రాంతాల నుండి వస్తున్న సినిమాలు ప్రేక్షకులకు ఒక సరికొత్త సినిమాటిక్ అనుభూతి ఇస్తున్నాయి. అక్కడి విభిన్నమైన కల్చర్‌ని, అచ్చమైన భావోద్వేగాలని చాలా రియలిస్టిక్‌గా చూపిస్తూ ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఇందుకు బెస్ట్ ఎగ్జాంపుల్ గా ఈ శుక్రవారం థియేటర్లలోకి వస్తున్న సిక్కిం మూవీ ‘షేప్ ఆఫ్ మోమో’ని చెప్పుకోవచ్చు. ట్రిబేనీ రాయ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఇప్పటికే 15కి పైగా అంతర్జాతీయ అవార్డ్స్ గెలుచుకుంది. జోయా అక్తర్, పాయల్ కపాడియా లాంటి క్రేజీ మేకర్స్ ఈ ప్రాజెక్ట్‌కి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ గా సపోర్ట్ ఇవ్వడం విశేషం. ఇలాంటి అద్భుతమైన సినిమాలను థియేటర్లకు తీసుకురావడం ద్వారా స్పిరిట్ మీడియా అన్ని ప్రాంతాల సినిమాలకు సమానమైన ఇంపార్టెన్స్ ఇస్తూ ఒక మంచి సినిమా కల్చర్ ని బిల్డ్ చేస్తోంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.